News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :153 | ఖమ్మం | శుక్రవారం, జూలై 18, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## బనకచర్ల బాగోతం... రేడియో బయటపెట్టింది

- సీఎం అడ్డంగా దొరికిండు
- రేవంత్ ఓ గజినీ.. ఆయన చుట్టూ గార్బేజ్ బ్యాచ్
- చిట్ చాట్ లో మాజీ మంత్రి హరీశ్ రావు



బనక చర్ల బాగోతాన్ని ప్రసార భారతి బయటపెట్టిందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఇవాళ ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. బనకచర్ల చీకటి ఒప్పందాన్ని నిన్న ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడిస్తే, ఇవాళ ఆల్ ఇండియా రేడియో బట్టబయలు చేసిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అడ్డంగా

వివరాలు 2లో..

## అందరూ వద్దంటున్న ఆ లింక్ ప్రాజెక్టుపై చంద్రబాబుకు అంత ప్రేమెందుకో!

- బనకచర్ల ప్రాజెక్టు విషయంలో షర్మిల విమర్శలు
- బనకచర్ల ప్రాజెక్టు ఓ గుదిబండ అని వ్యాఖ్యలు
- అర్థంపర్థంలేని ప్రాజెక్టులు కడతామంటే చూస్తూ ఊరుకోబోమని వెల్లడి

వివరాలు 2లో..




## నీటి వాటాల్లో.. బీసీ రిజర్వేషన్ల అమలులో
# ద్రోహం చేసింది కేసీఆరే

- కృష్ణా జలాల్లో ఏపీ 1,200 టీఎంసీలు వాడుకున్నా పట్టనట్లుగా వ్యవహరించారు
- బనకచర్లపై చర్చ గురించి కేంద్రమే స్పష్టత ఇచ్చింది
- సెప్టెంబరు 30 లోపు అన్ని స్థానిక సంస్థల ఎన్నికలూ పూర్తిచేస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఇదివరకు డ్రగ్స్ ఆరోపణలు వచ్చినప్పుడు రక్తం, జుట్టు నమూనాలు ఇస్తానంటూ బీరాలు పలికి, తర్వాత దానిపై చర్చజరగకుండా చూడాలనే ఉద్దేశంతో కోర్టుకెళ్లి స్టే ఉత్తర్వులు తెచ్చుకున్న కేటీఆర్ ప్రగల్భాలు చూస్తుంటే నవ్వొస్తోంది. కేటీఆర్, ఆయన బావమరిది ఫామ్‌హౌస్ చుట్టూ ఉన్నది గంజాయి, డ్రగ్స్ బ్యాచే. కేటీఆర్ స్నేహితుడు కేదార్‌నాథ్ దుబాయ్‌లో అన్ని రకాల డ్రగ్స్ కలగలిపి తీసుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఆయన మరణానికి దారితీసిన నివేదికలను అక్కడి నుంచి తెప్పించాం. అవసరమైనప్పుడు వాటిని అసెంబ్లీలోనూ పెడతాం. సీఎం రేవంత్‌రెడ్డి

కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటా రాబట్టే విషయంలో, బీసీలకు రిజర్వేషన్లు అమలుచేసే విషయంలో రాష్ట్రానికి తీరనిద్రోహం చేసింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆరేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ 720 టీఎంసీలకు బదులు 1,200 టీఎంసీలు వాడుకున్నా కేసీఆర్ పదేళ్లపాటు పట్టనట్లుగా వ్యవహరించారని దుమ్మెత్తిపోశారు. రాష్ట్ర ద్రోహి కేసీఆరే అని అన్నారు. కృష్ణా, గోదావరి జల వివాదంపై కేంద్రజలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో పాల్గొన్న ఆయన గురువారం ఇక్కడ తన నివాసంలో దాదాపు 1.45 గంటలపాటు విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

'బుధవారం నాటి సమావేశంలో ఆంధ్రప్రదేశ్ తన ఎజెండా, మేం మా అజెండా పెట్టాం. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ పరిష్కరించలేని మూడు సమస్యలపై అక్కడికక్కడే నిర్ణయానికి వచ్చాం. నిర్ణయానికి రాలేని అంశాలపై సాంకేతిక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం. సమావేశంలో బనకచర్ల గురించి చర్చ వచ్చిందా? లేదా? అన్న విషయంపై కేంద్ర ప్రభుత్వ ప్రకటన స్పష్టత ఇచ్చింది' అని తెలిపారు. జల వివాదాలపై బద్ధ శత్రువులైన భారత్-పాకిస్థాన్‌లు మాట్లాడుకో గా లేంది తాను ఆంధ్రప్రదేశ్ తో మాట్లాడితే తప్పేంటి అని ప్రశ్నించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు కోసం మహారాష్ట్రకు

వివరాలు 2లో..

### నేను గంజాయి బ్యాచ్‌లకు భయపడను

నేను గంజాయి బ్యాచ్‌లకు భయపడను. నేను ప్రధాన ప్రతిపక్షనాయకుడిని చర్చకు పిలిస్తే కేటీఆర్ ముందుకొస్తున్నారు. చర్చించడానికి ఆయన ఎవరు? ఒకవేళ ఆయనే ప్రతిపక్షస్థానానికి పనికొస్తారని తండ్రి నమ్మి ఉంటే అసెంబ్లీలో తన తరపున మాట్లాడటానికి కేసీఆర్ ఆయన్ను ఆథరైజ్ చేస్తూ లేఖ ఇచ్చేవారుకదా? అలా ఇవ్వడంలేదంటే ఆయన పనితీరుపై తండ్రికి అనుమానం ఉన్నట్లే.

## అణువంత ఆధారం లేకుండా అడ్డగోలు ఆరోపణలా?

- డ్రగ్స్ కేసులో నా పేరుంటే రుజువు చూపాలి
- లేదంటే సీఎం క్షమాపణ చెప్పాలి
- కేటీఆర్ డిమాండ్



'డ్రగ్స్ కేసులో నాపై విచారణ జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆధారం ఏంటో చెప్పాలి. నాపై ఏదైనా కేసు నమోదైందా? కనీసం అణువంత రుజువైనా ఉందా? తాను చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి ఆధారాలు బయటపెట్టాలని సవాల్ చేస్తున్నా. లేదంటే తప్పు మాట్లాడినట్లు అంగీకరించి క్షమాపణ చెప్పాలి' అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. దిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం మీడియాతో చిట్‌చాట్‌లో చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'మీడియాతో చిట్‌చాట్‌ల పేరిట నాపై, ఇతరులపై సీఎం రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా ఆరోపణలు చేయడం పరిపాటిగా మారింది. కేవలం ముఖ్యమంత్రి కార్యాలయానికి గౌరవం ఇచ్చి.. ఇప్పటివరకు సంయమనం పాటించాను. హైదరాబాద్‌లో చర్చకు పిలిస్తే.. నాతో ముఖాముఖి చర్చించలేక దిల్లీ వరకు ప్రయాణించి మరీ బురద చల్లుతున్నారు. కేవలం చట్టం, న్యాయస్థానాల పరిధి నుంచి తప్పించుకోవడానికే ముఖ్యమంత్రి చిట్‌చాట్‌ల పేరుతో తెరవెనుక మాటలు మాట్లాడుతూ.. నా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. వీటన్నింటినీ ఇకపై సహించేది లేదు. రేవంత్‌రెడ్డి చేసిన అసత్యపూరిత, దురుద్దేశపూర్వక నిందలకు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ముఖ్యమంత్రి తాను చేసిన నిరాధార ఆరోపణలకు వెంటనే క్షమాపణ చెప్పాలి. లేదంటే పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని కేటీఆర్ హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం.. పలు ప్రాంతాల్లో మోకాలి లోతు వరకు నీరు

- జలమయమైన హైదరాబాద్ రోడ్లు
- రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారుల ఇబ్బందులు
- తెలంగాణలోని వివిధ జిల్లాల్లో భారీ వర్షం



హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. దీనితో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కూకట్‌పల్లి, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, ప్రగతి నగర్, బోయినపల్లి, మారేడ్‌పల్లి, కాప్రా, ఈసీఐఎల్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, తిరుమలగిరి, బేగంపేట, అల్వాల్, ఉప్పల్, బోడుప్పల్, మేడిపల్లి

వివరాలు 2లో..

## 10 శాతం విరిగిన బియ్యం సరఫరాకు సువర్ణ అవకాశం

- కానూరులో రైస్ మిల్లర్ల ప్రతినిధులతో మంత్రి నాదెండ్ల సమావేశం
- ధాన్యం సేకరణ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైందని వెల్లడి
- కేంద్రం 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉందని వివరణ

వివరాలు 2లో..



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన లక్ష్యాల ప్రకారం, కేంద్రానికి కస్టమ్ మిల్లింగ్ రైస్ ను 10 శాతం బ్రోకెన్ (విరిగిన) బియ్యంతో సరఫరా చేసేందుకు రైస్ మిల్లర్లు సిద్ధం కావాలని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ఈరోజు విజయవాడ కానూరులోని సివిల్ సప్లై భవన్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన రైస్ మిల్లర్ల ప్రతినిధులతో జరిగిన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాలలో 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం సేకరించడం ద్వారా పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైందని

## అక్రమ మైనింగ్ కేసులో వంశీ ముందస్తు బెయిల్ రద్దు

- కేసును మళ్లీ విచారించండి
- ఇరుపక్షాల వాదనలు విన్నాకే తుది ఉత్తర్వులివ్వండి
- హైకోర్టుకు సుప్రీం ఆదేశం
- ఇలాంటి విచారణ గురించి ఎప్పుడూ వినలేదని వ్యాఖ్య



అక్రమ మైనింగ్ కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత వల్లభనేని వంశీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఏపీ హైకోర్టు మే 29న జారీ చేసిన ఉత్తర్వులను

వివరాలు 2లో..

## ఔటర్ రింగ్ రైలుకు అనుమతివ్వండి
### కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి



తెలంగాణలో రైల్వే అనుసంధానత పెంపు కోసం నూతన ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి దిల్లీలోని రైల్ భవన్‌లో అశ్వినీ వైష్ణవ్‌తో రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రీజనల్ రింగు రోడ్డుకు సమాంతరంగా ప్రతిపాదించిన ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు ఫైనల్ లొకేషన్ సర్వేకు రైల్వే బోర్డు ఇప్పటికే అనుమతి ఇచ్చిందని సీఎం గుర్తుచేశారు. రూ. 8 వేల కోట్ల ఈ ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరారు. హైదరాబాద్ డ్రైపోర్ట్ నుంచి బందరు ఓడరేవుకు అనుసంధానంగా రైలుమార్గం మంజూరు చేయాలని కోరారు. తెలంగాణలో రైల్వే ఆపరేషన్స్‌ను మరింత సమర్థంగా నిర్వహించేందుకు కాజీపేటలో రైల్వే డివిజన్ ఏర్పాటు

వివరాలు 2లో..

## బోయ నరసింహులు కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి లోకేశ్ హామీ



- ఫ్యాక్షన్ బారినపడి సర్వం కోల్పోయిన బోయ నరసింహులు కుటుంబం
- ప్రత్యర్థుల చేతుల్లో బోయ నరసింహులు సహా ముగ్గురి హత్య
- కుటుంబ సభ్యులను ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని మాట్లాడిన మంత్రి లోకేశ్

వివరాలు 2లో..

## ఫోన్ ట్యాపింగ్... బండి సంజయ్‌కి సిట్ నుంచి పిలుపు




వివరాలు 2లో..

- ఈ నెల 24న వాంగ్మూలం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన అధికారులు
- లేక్ వ్యూ అతిథి గృహంలో స్టేట్‌మెంట్ ఇవ్వాలని పేర్కొన్న సిట్
- ఫోన్ ట్యాపింగ్ కేసులో నేతల వాంగ్మూలం తీసుకుంటున్న సిట్

# నీటి వాటాల్లో.. బీసీ రిజర్వేషన్ల అమలులో ద్రోహం చేసింది కేసీఆరే

- మొదటి పేజి తరువాయి

కూడా వెళ్తానన్నారు. తాను ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికే ప్రాధాన్యమిస్తానని, కొట్లాట తన అంతిమ అస్త్రమని ప్రకటించారు. 'భారత రాష్ట్ర సమితి సాధించలేని చాలా వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపెట్టింది. నేను సమన్వయంతో వెళ్లడంవల్లే కేసీఆర్‌కు పదేళ్లలో సాధ్యంకాని ఎన్నో పనులను కేంద్రం నుంచి సాధించుకోగలిగాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% బీసీ రిజర్వేషన్లు మేం అమలు చేసి చూపుతాం' అని ధీమా వ్యక్తంచేశారు.

**రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుకు...ప్రస్తుత ఆర్డినెన్స్‌కు సంబంధంలేదు**

"2018కి ముందు రాష్ట్రంలో బీసీలకు 34% రిజర్వేషన్లు ఉంటే వాటిని 23%కి తగ్గిస్తూ చట్టం చేసింది కేసీఆరే. రిజర్వేషన్లు తగ్గించమని కోర్టు ఉత్తర్వులు లేకపోయినా కేసీఆర్ ఆ పనిచేసి బీసీలకు తీరని అన్యాయం చేశారు. ఇప్పుడు గవర్నర్ ముందున్న ఆర్డినెన్స్... గతంలో బీసీ రిజర్వేషన్లను 23%కి తగ్గిస్తూ కేసీఆర్ చేసిన చట్టాన్ని రద్దుచేస్తూ జారీచేసింది. పాత చట్టాన్ని రద్దుచేస్తే 42% రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం అవుతుంది. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుకు, ప్రస్తుత ఆర్డినెన్స్‌కు సంబంధంలేదు. రాష్ట్రపతి ముందు ఉన్నది విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42%కి పెంచుతూ చేసిన బిల్లు. రెండూ వేర్వేరు.

ఇచ్చంపల్లి ప్రాజెక్టుపై సాంకేతిక నిపుణులు సాంకేతికంగా సాధ్యాసాధ్యాల గురించి చెప్పిన తర్వాత మేం రాజకీయ నిర్ణయం తీసుకుంటాం. నాగార్జునసాగర్ మీదుగా ఇచ్చంపల్లి-కావేరి అనుసంధానం మొదలుపెట్టాలని మేం ఇదివరకే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశాం. అయితే 20 ఏళ్ల క్రితం డీపీఆర్ తయారైంది కాబట్టి అప్పటికి, ఇప్పటికి పరిస్థితులు మారి ఉంటాయి. అందువల్ల ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సర్వే చేయించాలని చెబుతున్నాం. గోదావరి-కావేరి అనుసంధానంలో 80% నీరు ఏపీ, తెలంగాణలకు, 20% తమిళనాడుకు వెళ్లాల్సి ఉంటుంది. అంతే తప్ప మా బేసిన్ నుంచి నీటిని అంతా బయటికి తరలిస్తామంటే చూస్తూ ఊరుకోవడానికి నేనేమీ కేసీఆర్‌ను కాదు.

**వాళ్లు చేసిందే ఇప్పుడు మేం చేస్తే తప్పా?**

చర్చలకు పోకుండా చేతులెత్తేస్తే మనం సరెండర్ అయినట్లే. చర్చలే తప్పయితే 2016, 2020ల్లో కేసీఆర్ ఎపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లి చంద్రబాబు, జగన్‌లతో ఎలా మాట్లాడారు? వాళ్లు చేసిందే ఇప్పుడు మేం చేస్తే తప్పా? ఏపీ ముఖ్యమంత్రితో నేను చర్చించడాన్ని తప్పుపడుతున్న కేటీఆర్.. మూడుసార్లు రహస్యంగా లోకేశ్‌తో ఎందుకు సమావేశమయ్యారో చెప్పాలి.

**విషాన్ని కుమ్మరించడానికి కుయుక్తులు**

ఎవరెన్ని విమర్శలు చేసినా నేను దిల్లీకి రావడం, కేంద్ర మంత్రులను కలవడం మానను. కృష్ణాలో 299 టీఎంసీలు చాలని ఒకసారి, 400 టీఎంసీలు చాలని మరోసారి లేఖ రాసిన హరీశ్‌రావు ఇప్పుడు మేం అంతకంటే ఎక్కువగా 500 టీఎంసీలు అడగడాన్ని తప్పుపడుతున్నారు. ఎవరైనా ఇలా మాట్లాడతారా? రోజా ఇంట్లో చేపల పులుసు తిని బేసిన్లు గీసిన్లు లేవు, రాయలసీమను రతనాలసీమ చేస్తా అని మాట్లాడింది కేసీఆరే. చంద్రబాబుతో ఎపెక్స్ కౌన్సిల్‌లో కూర్చొని.. గోదావరి నుంచి 3 వేల టీఎంసీలు సముద్రం పాలవుతున్నాయి, వాటిని వాడుకోవాలని చెప్పింది కూడా ఆయనే. ఆయన చేసిన తప్పులను ఇప్పుడు మేం సరిదిద్దుతుంటే చూసి కడుపులోని విషాన్ని కుమ్మరించడానికి కుయుక్తులు పన్నుతున్నారు.

**సినిమాల్లో విలన్ ఎప్పుడైనా మొదట్లోనే చచ్చిపోతాడా?**

మేం ప్రతి కేసు విచారణలోనూ నిబంధన ప్రకారం వెళ్తున్నాం. కాళేశ్వరం అవినీతిపై కమిషన్ అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతోంది. కేసీఆర్‌ను కూడా పిలిపించి విచారించింది. కొందరు కేసీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నిస్తున్నారు. సినిమాల్లో విలన్ ఎప్పుడైనా మొదట్లోనే చచ్చిపోతాడా? అది క్లైమాక్స్‌లో జరుగుతుంది. ఇక్కడా అంతే. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పోటీ చేస్తుంది. మరణించిన వ్యక్తి కుటుంబసభ్యులు పోటీ చేస్తే మిగతాపార్టీలు అభ్యర్థులను నిలబెట్టకూడదని ఇదివరకున్న సంప్రదాయాన్ని ఉల్లంఘించింది కేసీఆరే. పీజేఆర్ చనిపోయినప్పుడు అప్పటి ప్రధాన ప్రతిపక్షం తెదేపా.. అభ్యర్థిని నిలబెట్టకూడదని నిర్ణయించినా, కేసీఆర్ మాత్రం తనపార్టీ తరఫున పోటీ పెట్టారు" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

చర్చలకు పోకుండా చేతులెత్తేస్తే మనం సరెండర్ అయినట్లే. చర్చలే తప్పయితే 2016, 2020ల్లో కేసీఆర్ ఎపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లి చంద్రబాబు, జగన్‌లతో ఎలా మాట్లాడారు? వాళ్లు చేసిందే ఇప్పుడు మేం చేస్తే తప్పా? ఏపీ ముఖ్యమంత్రితో నేను చర్చించడాన్ని తప్పుబడుతున్న కేటీఆర్ మూడుసార్లు రహస్యంగా లోకేశ్‌తో ఎందుకు సమావేశమయ్యారో చెప్పాలి.

**రిజర్వేషన్ల సమస్యకు మందు కనిపెట్టాం**

కోర్టులు ఎప్పుడూ రిజర్వేషన్లు 50%కి మించకూడదని చెప్పలేదు. కచ్చితమైన డేటా ఉంటే చేసుకోవచ్చు, లేదంటే సాధ్యం కాదని చెప్పాయి. మేం ఇప్పుడు రోగానికి మందు కనిపెట్టాం. దాంతో రోగాన్ని నయం చేస్తాం. కులగణన ద్వారా స్పష్టమైన డేటా సంపాదించాం. దాన్ని ఎవ్వరూ ప్రశ్నించలేరు. ఆ డేటాను అవసరమైనప్పుడు బయటపెడతాం. ఎప్పుడు బహిర్గతం చేయాలన్న దానిపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. సెప్టెంబరు 30 లోపు పంచాయతీ నుంచి జడ్పీ వరకు అన్ని స్థానిక సంస్థల ఎన్నికలూ పూర్తిచేస్తాం.

**కిషన్‌రెడ్డీ... ముందు ఆ మూడు రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేయించండి**

రాష్ట్రంలో మేం ముస్లింలకు కులప్రాతిపదికన తప్పితే మతప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయడంలేదు. మోదీ పుట్టిన గుజరాత్, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్, ఆర్ఎస్ఎస్ జన్మస్థలం మహారాష్ట్రల్లోనూ ముస్లిం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఇక్కడ ముస్లిం రిజర్వేషన్లు వద్దని చెప్పే కిషన్‌రెడ్డి ముందు ఆ మూడు రాష్ట్రాల్లో రద్దు చేయించి ఆ తర్వాత తెలంగాణలో డిమాండ్ చేయాలి. బీసీ రిజర్వేషన్ బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెట్టాలని భాజపా ఓబీసీ జాతీయ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేస్తున్నారు. ఆ పని భాజపా చేయిస్తుందని లేఖ రాస్తే వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసి పంపడానికి సిద్ధంగా ఉన్నాం.

# అందరూ వద్దంటున్న ఆ లింక్ ప్రాజెక్టుపై చంద్రబాబుకు అంత ప్రేమెందుకో!

బనకచర్ల ప్రాజెక్టు అంశంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అందరూ వద్దంటున్న పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చంద్రబాబుకు అంత ప్రేమెందుకో ప్రజలకు అర్థం కావట్లేదంటూ సోషల్ మీడి యాలో స్పందించారు. ఆ ప్రతిపాదన పనికి రాదని రాయలసీమ ప్రొఫెసర్లు చెబుతున్నారు... రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు తప్ప ప్రయోజనం లేదని ఇంజినీర్లు మొత్తుకుంటున్నారు... కాంట్రాక్టర్ కు తప్ప ఏపీకి ఏమాత్రం ఉపయోగపడని గుదిబండ ప్రాజెక్టు కోసం రాష్ట్రాన్ని, పాలనను గాలికి వదిలేసిన చంద్రబాబు, ఢిల్లీ చుట్టూ అంత ఆత్రంగా ఎందుకు తిరుగుతున్నట్టు అని షర్మిల ప్రశ్నించారు.

"బనకచర్ల లింక్ ప్రతిపాదన పోలవరం అసలు ప్రాజెక్టుకే ఎసరుపెడుతుందని పోలవరం ప్రాజెక్టు అథారిటీ చెబుతున్నా చంద్రబాబు గారికి ఎందుకు అర్థం కావడం లేదు? మీ సొంత ప్రయోజనాల కోసం ఏకంగా పోలవరాన్నే ముంచేద్దామని ప్లాన్ చేస్తున్నారా? అందుకే ఎత్తు తగ్గించారా? ఏ నీళ్ల కోసం బనకచర్ల లింక్ ప్రతిపాదన చేశారని గోదావరి అథారిటీ అడిగిన దానికి మీ సమాధానం ఎక్కడ? రాయలసీమకు హక్కుగా రావాల్సిన కృష్ణా, తుంగభద్ర నీళ్ల గురించి ఆలోచన చేయకుండా, ముక్కు ఎక్కడంటే తలచుట్టూ తిప్పినట్లుగా గోదావరి నుంచి తెస్తామనడం ఎవరిని మోసం చేయడానికి? 2014 నాటికి మహానేత వైఎస్సార్ ప్రారంభించిన జలయజ్ఞం పెండింగ్ ప్రాజెక్టులు దాదాపు 39కి పైనే. ఈ 10 ఏళ్లలో టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు తట్టెడు మట్టి కూడా తియ్యలేదనేది కళ్ళకు కట్టిన వాస్తవం. పెండింగ్ ప్రాజెక్టులకు సుమారు రూ.40 వేల కోట్లు వెచ్చిస్తే 50 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు, కోటి మంది జనాభాకు తాగునీరు అందుతుందని తెలిసినా... ఇప్పటి కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం బాధాకరం. పోలవరంతో సహా జలయజ్ఞం ప్రాజెక్టులు పూర్తి చేస్తే బనకచర్ల అవసరం లేదని తెలిసి చంద్రబాబు గారు అనుమతుల కోసం ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారంటే ఇది అవినీతికి వ్యూహం కాకపోతే మరేమిటి?

ఇక బీజేపీ దత్తపుత్రుడు జగన్ మోహన్ రెడ్డి గారు పోలవరం గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వర్ణించినట్లుంది. వైఎస్సార్ కొడుకై ఉండి 5 ఏళ్లలో పోలవరంలో తట్టెడు మట్టి తీశారా? మహానేత ఆశయ సాధకుడే అయితే పోలవరంపై ఎందుకు నిర్లక్ష్యం చేశారు? 2022లో పోలవరం నీటి నిల్వ సామర్థ్యం 41.15 మీటర్ల కుదించిన పాపం ఆనాటి మీ ప్రభుత్వంది కాదా? అంచనా వ్యయం రూ.55 వేల కోట్ల నుంచి రూ.37 వేల కోట్లకు తగ్గిస్తుంటే వేడుక చూసింది మీరు కాదా? ప్రాజెక్ట్ ఎత్తు కుదింపు పాపం ముమ్మాటికి జగన్ గారిదే. బీజేపీకి అమ్ముడుపోయి మోదీ కోసం పోలవరం ప్రయోజనాలను తాకట్టు పెట్టి... ఇప్పుడు ఎత్తు పెంచాలని మాట్లాడుతున్న మాటలు బీద ఏడుపులు తప్ప మరోటి కాదు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. చివరి రాష్ట్రంగా మిగులు జలాలను వాడుకోవడం రాష్ట్ర హక్కు... ఈ విషయంలో ఎటువంటి అభ్యంతరాలు లేవు. కానీ పెండింగ్ ప్రాజెక్టులకు పక్కన పెట్టి, మీ స్వార్థ ప్రయోజనాల కోసం అర్థం పర్థం లేని ప్రాజెక్టులు కడతాం అంటే చూస్తూ ఊరుకొనేది లేదు. వెంటనే బనకచర్ల ప్రయత్నాలు ఆపండి. ముందు పోలవరం సంగతి తేల్చండి. పాత డీపీఆర్ ప్రకారమే పోలవరాన్ని 45.7 మీటర్ల ఎత్తులో నిర్మాణం జరిగేలా చూడండి. పెండింగ్ లో ఉన్న జలయజ్ఞం ప్రాజెక్టులకు వెంటనే నిధులు కేటాయించి పూర్తి చేయండి" అంటూ షర్మిల స్పష్టం చేశారు.

# అక్రమ మైనింగ్ కేసులో వంశీ ముందస్తు బెయిల్ రద్దు

- మొదటి పేజి తరువాయి

సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. కౌంటర్ దాఖలు చేస్తామని తాము చెప్పినా పట్టించుకోకుండా ఆరోజు కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్న ఏపీ ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఈ కేసును తిరిగి విచారించాలని హైకోర్టును ఆదేశించింది. జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. వంశీకి హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ హైకోర్టు తమకు కౌంటర్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వకుండానే వారం రోజుల్లో కేసు విచారణ ముగించిందన్నారు. అందువల్ల ఈ కేసును పునర్విచారణ కోసం హైకోర్టుకు పంపాలని కోరారు. వంశీ తరఫున మాజీ అడ్వొకేట్ జనరల్ శ్రీరాం వాదిస్తూ ఈ కేసులో తాము వాదనలు వినిపించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం రెండుసార్లు చెప్పిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అలా ఎక్కడ చెప్పిందో చూపండని జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ అడగడంతో ఆయన హైకోర్టు ఉత్తర్వులను చదివి వినిపించారు. అందులో ఎక్కడా వాదనలకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లు లేదు కదా? అని న్యాయమూర్తి ప్రశ్నించారు. రోహత్గీ జోక్యం చేసుకుంటూ హైకోర్టు ఈ కేసును రోజువారీగా వాయిదా వేసుకుంటూ పోయింది తప్ప, ఎప్పుడూ తమ వాదనలు వినిపించడానికి అవకాశం ఇవ్వలేదన్నారు. జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ స్పందిస్తూ ఇలాంటి విచారణ గురించి తాము ఎప్పుడూ వినలేదన్నారు.

**ప్రభుత్వానికి ఎందుకు అవకాశమివ్వకూడదు?**

అంతకుముందు జస్టిస్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తమ వాదనలను వినకుండానే హైకోర్టు తీర్పు వెలువరించిందన్న రోహత్గీ వాదనలతో ఏకీభవించారు. రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్‌కు సమయం అడిగినట్లు హైకోర్టు ఉత్తర్వుల్లో ఉందన్నారు. ప్రతివాదికి మధ్యంతర రక్షణ ఉన్న సమయంలో కౌంటర్ దాఖలు చేయాలనుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. రోహత్గీ చెప్పిన వాదనలు హైకోర్టు ఉత్తర్వుల్లో ప్రతిఫలిస్తున్నాయంటూ మే 29న జారీ చేసిన ఉత్తర్వులను కొట్టేస్తున్నామని తేల్చిచెప్పారు. ఈ కేసును పునర్విచారణ కోసం హైకోర్టుకు తిప్పి పంపుతున్నట్లు పేర్కొన్నారు. వారంలోపు కౌంటర్ దాఖలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది చెప్పారన్నారు. ఆ వెంటనే దీనిపై ఇరుపక్షాల వాదనలు విని సాధ్యమైనంత త్వరగా విచారణ ముగించాలని హైకోర్టుకు నిర్దేశించారు.

మధ్యంతర రక్షణ కల్పించలేం

ఈ దశలో వంశీ తరఫు న్యాయవాది జోక్యం చేసుకుంటూ తమ క్లయింట్ జైల్లో ఉన్నప్పుడు పీటీ వారంట్ అమలుపై స్టే ఇచ్చారని, ఇప్పుడు ఆయన బెయిల్‌పై బయటికొచ్చినందున అరెస్ట్ చేసే అవకాశం ఉందన్నారు. మధ్యంతర రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ధర్మాసనం నిరాకరించింది.

# ఔటర్ రింగ్ రైలుకు అనుమతివ్వండి

- మొదటి పేజి తరువాయి

చేయాలని కోరారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల అనుసంధానం, పారిశ్రామిక, వ్యవసాయ ఎగుమతులు, దిగుమతుల కోసం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వికారాబాద్-కృష్ణా (122 కి.మీ.బీ అంచనా వ్యయం రూ.2,677 కోట్లు), కల్వకుర్తి-మాచర్ల (100 కి.మీ.బీ రూ.2 వేల కోట్లు), డోర్నకల్-గద్వాల (296 కి.మీ.బీ రూ.6,512 కోట్లు), డోర్నకల్-మిర్యాలగూడ (97 కి.మీ.బీ రూ.2,184 కోట్లు) మార్గాలను వంద శాతం రైల్వేశాఖ ఖర్చుతో మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు.

**ముచ్చర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు వినతి**

తెలంగాణలో సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల బాధ్యతలూ నిర్వహిస్తున్న అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నందువల్ల ప్రతిపాదిత అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ ప్రాజెక్ట్, మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే, ఫ్యాబ్ ప్రాజెక్ట్ క్రిస్టల్ మ్యాట్రిక్స్‌కు ఆమోదం తెలపాలని కోరారు. ముచ్చర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు ఈఎంసీ 2.0 పథకం కింద అనుమతి ఇవ్వాలని విన్నవించారు. రీజనల్ రింగు రోడ్డు సమీపంలో నూతన ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్కు ఏర్పాటు చేయాలన్నారు. సీఎం విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలో ఎంపీలు బలరాంనాయక్, చామల, రఘువీర్‌రెడ్డి, రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, ఉన్నతాధికారులు సంజయ్‌కుమార్, వికాస్‌రాజ్, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

## బోయ నరసింహులు కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి లోకేశ్ హామీ

రాయలసీమలో ఫ్యాక్షన్ బారినపడి నష్టపోయిన కుటుంబా లను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉండవల్లి నివా రానికి పిలుపించుకుని మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గం కామిరెడ్డిపల్లికి చెందిన దాసరి నరసింహులు టీడీపీలో మొదటి నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. 2011లో ప్రత్యర్థులు దారికాచి ద్విచక్రవాహనంపై వెళు తున్న బోయ నరసింహులు సహా అతని కుమారుడు, కుమార్తెను దారుణంగా హత్య చేయడం సంచలనం సృష్టించింది. ఫ్యాక్షన్ బారిన పడి బోయ నరసింహులు కుటుంబం ఎంతో నష్టపోయింది. అప్పట్లో పార్టీ అధినేత చంద్రబాబు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఇప్పుడు మృతుడి కుటుంబ సభ్యులను ఉండవల్లి నివాసానికి ఆహ్వానించిన మంత్రి నారా లోకేశ్.. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

**మృత్యుంజయ చిన్నారిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేశ్**

ఆనాటి ఫ్యాక్షన్ హత్యా ఘటనలో రెండు నెలల చిన్నారి మృత్యుంజయుడిగా బయటపడ్డాడు. సదరు బాలుడిని మంత్రి లోకేశ్ ఆప్యాయంగా పలకరించారు. చదువు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని ఉన్నతస్థాయికి వెళ్లాలని, తాను కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఉండవల్లి నివాసానికి పిలుపించుకుని తమ యోగక్షేమాలు వాకబు చేయడం పట్ల బోయ నరసింహులు కుటుంబసభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్... బండి సంజయ్‌కి సిట్ నుంచి పిలుపు

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) నుంచి పిలుపు వచ్చింది. ఈ నెల 24న ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇవ్వాలని సమాచారం అందించింది. స్టేట్‌మెంట్ ఇవ్వడానికి హైదరాబాద్‌లోని లేక్ వ్యూ అతిథి గృహానికి రావాలని సూచించింది.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వివిధ పార్టీలకు చెందిన ఫోన్లను గత ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ముఖ్య నేతల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో సిట్ పలువురు నేతలను పిలిచి వాంగ్మూలం తీసుకుంటోంది.

## 10 శాతం విరిగిన బియ్యం సరఫరాకు సువర్ణ అవకాశం

- మొదటి పేజి తరువాయి

తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని 5 రాష్ట్రాల నుంచి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు హర్యానా, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి 10 శాతం బ్రోకెన్ రైస్‌ను సేకరించేందుకు లక్ష్యాలు ఇచ్చారని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రం నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్ ను 10 శాతం బ్రోకెన్ రైస్ తో కేంద్రానికి సరఫరా చేసేందుకు రైస్ మిల్లర్లు వారి సంసిద్ధతను స్పష్టమైన ప్రతిపాదనల ద్వారా తెలియజేయాలని ఆయన సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోటీపడి బియ్యం అందించడంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి రైస్ మిల్లర్లకు పిలుపునిచ్చారు. సంబంధిత రైస్ మిల్లర్లు కేంద్ర ప్రభుత్వ నిబంధనలను అనుసరించి, సరఫరా చేయాల్సిన CMR బియ్యంలో బ్రోకెన్ శాతం 10 శాతం మించకుండా చూసుకోవాలన్నారు. నిబంధనల మేరకు రైస్ మిల్లులు అవసరమైన టెస్టింగ్, ప్యాకింగ్, ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసి, ఇచ్చిన గడువులోగా సరఫరా చేయాలని ఆయన సూచించారు. నాణ్యమైన బియ్యాన్ని కేంద్రానికి సమయానికి అందించడం వల్ల రాష్ట్రానికి మంచి పేరు వస్తుందని, 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్' పేరు నిలబెట్టేలా అందరూ

కలిసికట్టుగా పని చేయాలని ఆయన అన్నారు. సరఫరా ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా, సంబంధిత అధికారులు మరియు మిల్లర్లు సమన్వయంతో ముందడుగు వేయాలని పౌర సరఫరాల శాఖ సూచించింది.

ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ సౌరబ్ గౌర్ ఐఏఎస్, సివిల్ సప్లై ఎండీ మానవీర్ జిలానీ ఐఏఎస్, సివిల్ సప్లై కార్పొరేషన్ ఉన్నతాధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బనకచర్ల బాగోతం... రేడియో బయటపెట్టింది

- మొదటి పేజి తరువాయి

దొరికి పోయారని చెప్పారు.

ఈ బాగోతాన్ని కవర్ చేసుకోవడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడింది తప్పు అని రేవంత్ రెడ్డి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. డ్రగ్స్, గంజాయి అంటూ మోకాలుకు, బోడి గుండుకు లింకులు పెడుతున్నారని ఫైర్ అయ్యారు. జై తెలంగాణ అనవేందుకయ్య అని మేము అడిగితే... తమ పార్టీ పైన ఏదో అంటున్నారన్నారు. రాహుల్ గాంధీ, మీ ఖర్గే కూడా జై తెలంగాణ అన్నారని గుర్తు చేశారు

## హైదరాబాద్‌లో భారీ వర్షం.. పలు ప్రాంతాల్లో మోకాలి లోతు వరకు నీరు

- మొదటి పేజి తరువాయి

మొదలైన ప్రాంతాల్లో అధిక వర్షం కురిసింది. అనేక ప్రాంతాల్లో మోకాలి లోతు వరకు నీరు నిలిచిపోయింది.పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు ట్రాఫిక్‌లో చిక్కుకొని అవస్థలు పడ్డారు. తార్నాక, హబ్సిగూడ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అధికంగా ఉంది.భారీ వర్షం కారణంగా వాహనదారుల ఇబ్బందులను తగ్గించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. హైడ్రా సిబ్బంది సైతం రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. తెలంగాణలోని వివిధ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

## గ్రంథాలయ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన వీరబాబు.

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా పసుపులేటి వీరబాబు గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,( సాయి కౌశిక్), జూలై 17,
యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా, పలు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ కార్యకలాపాల ఇన్చార్జిగా, కొత్తగూడెం ములుగు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ బాధ్యునిగా, ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పలు హోదాల్లో పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ విధేయుడినిగా పేరున్న ఆయనను గ్రంథాలయ చైర్మన్ గా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కరుణ కుమారి ఆయనకు పుష్పగుచ్చాన్ని అందించి ఘన స్వాగతం పలకడం తో పాటు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె వీరబాబుకు జిల్లా గ్రంథాలయ ఉద్యోగులను పరిచయం చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాలను త్వరలో పరిశీలిస్తానని, ఆయా గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వానికి విన్నవించి పరిష్కరించే దిశగా కృషి చేయనున్నట్లు తెలిపారు. గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలతో సమానమని, అలాంటి దేవాలయాలను సంపూర్ణంగా తీర్చిదిద్ది ఉద్యోగులు సిబ్బంది సహాయ సహకారాలతో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతానని తెలిపారు. అంతా కలిసిమెలిసి పని చేద్దామని, పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి పాఠకులకు అనుకూలమైన వాతావరణాన్ని గ్రంథాలయాల్లో మరింతగా ఏర్పాటు చేద్దామని తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రంథాలయాల పరిరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ ఇంచార్జ్ ఎం నవీన్ కుమార్, గ్రంథ పాలకులు జి. మణి మృదుల, నాగన్న, మధుబాబు అశ్వరావుపేట నియోజకవర్గ బీసీ సంఘం యువజన అధ్యక్షులు పల్లె వరప్రసాద్, లక్ష్మీదేవి పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు జల్లారపు ఈశ్వర్, భద్రాద్రి బీసీ సంఘం ఉపాధ్యక్షులు బండి శ్రీకాంత్ గౌడ్, లక్ష్మీదేవి పల్లి మండలం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లావుడియా నరేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుల్తాన్ యాదగిరి ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఎన్నిక.

టీఎస్ జేఏసీ జిల్లా అధ్యక్షులుగా గాజుల యాదగిరి ఎన్నిక.



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 17.
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ. తెలంగాణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుల్తాను యాదగిరి ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుల కమిటీ ఎన్నిక,
అధ్యక్షులు గాజుల యాదగిరి ఎన్నిక
ఉపాధ్యక్షులుగా కర్రీ చంద్రమౌళి ప్రధాన కార్యదర్శిగా పెంట సత్యనారాయణ కార్యదర్శి మొగిలి పాక నరసింహ సహాయ కార్యదర్శి తునికి బిక్షపతి ఆర్గనైజింగ్ కార్యదర్శి మాసాల మధుకర్ రాచకొండ గిరిబాబు మాటూరు కృష్ణమోహన్ నెయ్యిలే సుక్కయ్య జిల్లా కళాకారులు అధ్యక్షులు గా భూపతి రాములు ఉపాధ్యక్షులు కొత్త రామచంద్రు ప్రధాన కార్యదర్శి కానుకుంట్ల పుష్ప జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు చేరాల సుగుణ ఉపాధ్యక్షులు అంకిరెడ్డి వినోద ప్రధాన కార్యదర్శి కోటోజు బాలమణి గా ఎన్నిక కావడం జరిగింది జిల్లా అధ్యక్షులు గాజుల యాదగిరి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరినారు.

## గంగ దారి ఉపేందర్ కుటుంబాన్ని పరామర్శించి 50 వేల రూపాయలు ఆర్థిక సాయం చేసిన.

- స్థానిక ఎమ్మెల్యే కుంభం.



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 17.యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లింగరాజు పల్లి గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన గంగ దారి ఉపేందర్ వారి కుటుంబాన్ని పరామర్శించి ముగ్గురు పిల్లలకు ధైర్యం చెప్పి 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గ్రామ శాఖ ద్వారా అందజేసినారు,అదేవిధంగా మానవత్వంతో గంగ దారి ఉపేందర్ కుటుంబానికి ఏడవ తరగతి స్నేహితులు 32 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసినారు, లింగరాజుపల్లి మాజీ సర్పంచ్ గంధ మల్ల దానయ్య మాధవి గౌడ్ ?10000 వేల రూపాయలు ఉపేందర్ కుటుంబాన్నికి సహాయంచేసినారు, ఆదర్శ యూత్ ఎస్సీ కాలనీ వాసులు 9500 రూపాయలు సహాయం చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి మార్నింగ్ వాక్

- అశ్వారావుపేట కొత్త మున్సిపాలిటీలో సమస్యలపై మంత్రి ఆరా
- ఏజెన్సీ నియోజకవర్గ కేంద్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ప్రకటన



సికే న్యూస్ ప్రతినిధి అశ్వారావుపేట : అక్క ఎలా ఉన్నావు అంటూ మహిళ పారిశుద్ధ్య కార్మికులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో గురువారం రెవిన్యూ సమాచార గృహ నిర్మాణ శాఖ మంత్రి
పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. రింగ్ రోడ్డు సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్, బస్టాండ్ శ్రీ శ్రీ కళ్యాణ మండపం వరకు నడుస్తూ, ప్రజలను పలకరిస్తూ మున్సిపాలిటీలో సమస్యలపై ఆరా తీశారు.
సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ పనులలో జాప్యం పై ఆర్ అండ్ బి శాఖ అధికారులను వివరణ కోరారు. అనంతరం దొంతికుంట చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడితూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికులు ఆకాంక్ష మేరకు తెలంగాణ సరిహద్దుల్లోని అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేశామన్నారు.
ఏజెన్సీ ప్రాంతమైన అశ్వారావుపేట ను మెరుగైన మౌలిక వసతులతో పాటు సుందరీకరించాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దొంతికుంట చెరువుకు డ్రైనేజీల ద్వారా వచ్చే నీరుని శుద్ధి చేసే విధంగా ప్రణాళికలు ఉన్నాయన్నారు. దొంతికుంట చెరువు చుట్టూ రింగ్ బండ్ ఏర్పాటుచేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని యోచనలో ఉన్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన నిర్మాణ పనులకు అంచనాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పొంగులేటి వెంట కాంగ్రెస్ నేత జూపల్లి రమేష్ బాబు, చిన్నశెట్టి యుగేందర్, జూపల్లి ప్రమోద్, తుమ్మ రాంబాబు, అల్లాడి వెంకట రామారావు తదితరులు ఉన్నారు.

## ఉపేందర్ కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సహాయం అందజేత.




సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 17. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల లింగరాజుపల్లి గ్రామానికి చెందిన గంగాధరి ఉపేందర్ ఇటీవల కాలంలో గుండెపోటుతో మరణించాడు కాబట్టి వారికి 7 వ తరగతి స్నేహితులు 32000/-ఆర్థికసాయం చేయడం జరిగిందిలి
ఈ కార్యక్రమంలో స్నేహితులు పాల్గొన్నారు

## ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీడీవో జి జలంధర్ రెడ్డి.

సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 17. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి మొగిలి పాక కేర్చుపల్లి కాంచనపల్లి దాసిరెడ్డిగూడెం పులిగిల్ల గ్రామాలలో ఎంపీడీవో జి జలంధర్ రెడ్డి పర్యటించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించి నిర్మాణ పనులు వేగవంతంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయం ప్రకారం నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించినారు, ఉపాధి హామీలో భాగంగా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయడం గ్రామంలో వీధులలో మొక్కలు నాటాలని చెప్పడం జరిగింది.




## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్) జూలై17:చౌటుప్పల్ మండలం అంకిరెడ్డి గ్రామానికి చెందిన బుసిగంపల సురేష్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తనతోపాటు చదువుకున్న పదో తరగతి 2005-06బ్యాచ్ కి చెందిన విద్యార్థులు విషయం తెలుసుకున్నారు. మృతి చెందిన స్నేహితుని కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. స్నేహితుని కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. సురేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం సురేష్ భార్యా, పిల్లలకు రూ.33,500ల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి స్నేహితులు పాల్గొన్నారు.

## పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన...

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూలై -17:పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ప్రభుత్వ పాలన కొనసాగిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.మంత్రి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి గురువారం పెనుబల్లి మండలం, పాత కుప్పెనకుంట్ల గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనానికి ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తుందని అన్నారు. గత పాలకులు అమలు చేసిన మంచి పథకాలను కొనసాగిస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. పేద ప్రజలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఉగాది నుండి రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత బస్ ప్రయాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు.దేశంలో మరెక్కడా లేని విధంగా ఉగాది నుండి తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. 22 వేల 500 కోట్లతో ప్రభుత్వం పేద ప్రజల సొంతింటి కల కోసం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడతలో మంజూరు చేసిందని అన్నారు. ప్రతి సంవత్సరం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉంటుందని, నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇండ్ల పథకం కొనసాగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఎవ్వరు అధైర్య పడవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామన్నారు.
ఇందిరమ్మ ప్రభుత్వం సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ అందించిందని మంత్రి తెలిపారు. రైతు భరోసా పథకం క్రింద పెట్టుబడి సహాయం ఎకరానికి 10 వేల నుంచి 12 వేల రూపాయలకు పెంచి, రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఎన్నో కార్యక్రమాలు అమలుచేసి, అర్హులకు అందజేస్తున్నామని, ఇంకనూ చేయాల్సివుందని, ప్రభుత్వానికి అండగా నిలవాలని మంత్రి తెలిపారు.
కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, విజ్ఞప్తి మేరకు మంత్రి, సత్తుపల్లి నియోజకవర్గానికి మరో 1500 ఇండ్లు అదనంగా ఇచ్చారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి క్రింద 200 యూనిట్ల ఉచిత కరంట్, క్రొత్త రేషన్ కార్డుల జారీ, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ, రైతు ఋణమా, రైతు భీమా, రైతు భరోసా, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు, 500 రూపాయల బోనస్ ప్రభుత్వం ఇస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఎంతో పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందజేస్తున్నామన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, పెనుబల్లి మండల తహసీల్దార్ నారాయణ మూర్తి, ఎంపిడివో అన్నపూర్ణ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## వేముల యాదయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన కొప్పుల హరిదిప్ రెడ్డి



సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :ఆత్మకూరు మండలంలోని తిమ్మాపురం గ్రామంలో వేముల యాదయ్య అనారోగ్యంతో మృతి చెందారు వారి కుటుంబానికి మలిదశ ఉద్యమకారులు బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కే హెచ్ ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ బి ఆర్ ఎస్ శాఖ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## పాత బకాయిలు వెంటనే చెల్లించాలి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు



చేగుంట జులై 17 ( సీ కే న్యూస్) చేగుంట మండలంలో ని వివిధ గ్రామాల ఉపాధి తెలంగాణ రాష్ట్ర ఫీల్డ్ అసిస్టెంట్స్,యూనియన్,పిలుపుమేరకు చేగుంట లో ఎంపీడీవో చిన్నారెడ్డికి మూడు నెలల వేతనాలు రాని కారణంగా వారాంతపు మీటింగ్ ను బహిష్కరిస్తూ ఎంపీడీవో కి మెమోరాండం ఇచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వై. మాణిక్యం ఉపాధ్యక్షులు వి. వెంకటేశం ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీనివాస్ రెడ్డి , వెంకటేష్, సత్తయ్య, స్వామి, రాజా గౌడ్ ,యాదగిరి ,రామస్వామి, బాబయ్య, ఆంజనేయులు, కృష్ణమూర్తి ,కుమార్, లక్ష్మి, ఏసుమని,సీనియర్ మేట్స్,పాల్గొన్నారు

# మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ చేయూత...

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- అర్హులందరికీ రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం
- సత్తుపల్లి నియోజకవర్గంలోని 4819 స్వయం సహాయక సంఘాల సభ్యులకు 5 కోట్ల 68 లక్షల వడ్డీ లేని రుణాల చెక్కులు
- సత్తుపల్లి నియోజకవర్గం స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో పాల్గొని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి.



**సికె న్యూస్ ప్రతినిధి సత్తుపల్లి, జూలై -17:** మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో, నిజాయితీతో పనిచేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

మంత్రివర్యులు, గురువారం సత్తుపల్లి లోని రాణి ఈవెంట్ ఫంక్షన్ హాల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ లతో కలిసి సత్తుపల్లి నియోజకవర్గం స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో పాల్గొని వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ భీమా, ప్రమాద భీమా చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేసారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చాలా సంతోషంగా ఉందని, కదం తొక్కి, పెద్దఎత్తున మహిళలు సంబరాలకు వచ్చారని, అందరి దీవెనలు, ఆశీస్సులతో ఇందిరమ్మ ప్రభుత్వం 18 నెలలు పూర్తి చేసుకుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఆరా కొరా మంచి పనులను కొనసాగిస్తూ, ప్రజల కోరికలు తీరుస్తూ, ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను అమలుపరుస్తూ ముందుకు వెళుతున్నామన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మొదటి దశలో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు 22 వేల 500 కోట్లతో మంజూరు చేశామని, ప్రతి ఇంటికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పొందిన ఆడబిడ్డల కళ్ళలో ఆనందం చూస్తుంటే కొందరు ఓర్వలేక పోతున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు నిధులు విడుదల చేస్తుందని, ఎక్కడా కూడా నిధుల సమస్య లేదని అన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు.

దేశంలో మరెక్కడా లేని విధంగా ఉగాది నుండి 93 లక్షల పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యాన్ని రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్స్ చార్జిలను పెంచామని, మహిళల కోసం రాష్ట్రంలో ఎక్కడికి వెళ్ళినా ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని అన్నారు. పేదవాడి ఆరోగ్యాన్ని కాపాడాలని, రాజీవ్ ఆరోగ్య శ్రీ లబ్దిని 10 లక్షలకు పెంచామని మంత్రి అన్నారు.

గత పాలకుల హయాంలో నిర్లక్ష్యం చేసిన వడ్డీ లేని రుణాలను ప్రజా ప్రభుత్వంలో పునరుద్ధరించామని అన్నారు. కోటీ మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని ఉద్దేశ్యంతో సంవత్సరానికి 20 వేల కోట్ల రూపాయలు మహిళలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. మొదటి సంవత్సరం 21 వేల 632 కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు అందించామని అన్నారు.

జూలై 12 నుంచి జూలై 21 వరకు వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళలకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ లను ఏర్పాటు చేసి కరెంట్ వ్యాపారం నిర్వహించేలా, రైస్ మిల్లుల నిర్వహణ చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆర్టిసి సంస్థకు అద్దె బస్సులు మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు మహిళల ద్వారానే చేపడుతున్నట్లు, ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులు, నిర్వహణను అమ్మ ఆదర్శ పాఠశాలల మహిళా కమిటీలచే చేపడుతున్నట్లు అన్నారు. ప్రతి వ్యాపారంలో మహిళలను భాగస్వామ్యం కల్పిస్తున్నామని అన్నారు.

మహిళా సంఘాల సభ్యులకు 2 లక్షల రూపాయల లోన్ బీమా, 10 లక్షల రూపాయల ప్రమాద బీమా కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. పాఠశాల ఏకరూప దుస్తులు మహిళా సంఘాల ద్వారా కుట్టించి సరఫరా చేస్తున్నామని, మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ ప్రతి మండలంలో అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఇందిరమ్మ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, ఇచ్చిన ప్రతి మాటకు కట్టుబడి ఉంటుందని మంత్రి అన్నారు.

కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ, ద్వాక్రా గ్రూపుల నిర్మాణం గత ఇందిరమ్మ హయాంలోనే జరిగిందన్నారు. ఇప్పుడు మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారన్నారు. ఒకప్పుడు ఆడవారు ఇంటికే పరిమితమయ్యేవారని, రాను రాను గత అంధకారం నుండి ఇప్పుడు వెలుగు లోకి వచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల మంది మహిళా సభ్యులు మహిళా గ్రూపుల్లో ఉండగా, కోటి మందికి చేర్చి, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ముందుకు వెళుతుందన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి క్రింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సత్తుపల్లి నియోజకవర్గంలో 2200 క్రొత్త రేషన్ కార్డులు, 12 వేలకు పైగా రేషన్ కార్డుల్లో క్రొత్త సభ్యుల చేర్పు, కార్డులో ప్రతి సభ్యునికి 6 కిలోల సన్నబియ్యం, రైతు భరోసా, రైతు భీమా, రైతు రుణమాఫీ, సన్న వడ్లకు కనీస మద్దతు ధర తో పాటు, 500 రూపాయల బోనస్, నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు, సత్తుపల్లి కి అదనంగా మరో 1500 ఇందిరమ్మ ఇండ్లు, ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

ద్వాక్రా మహిళలకు సోలార్ యూనిట్, ఆర్.టి.సి. అద్దె బస్సులు, స్త్రీ టీ లు, షీరాక్స్ సెంటర్లు ఇచ్చినట్లు, త్వరలో రైస్ మిల్లులు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇంకనూ మహిళా సంఘాల్లో నమోదు కాని వారుంటే వెంటనే కావాలన్నారు. ప్రభుత్వం 15-19 సంవత్సరాల వయస్సు, 65 సంవత్సరాలు దాటిన, దివ్యా%శీ%గులకు ప్రత్యేక సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుందన్నారు. మహిళలు ముందుకు వస్తే ఎక్కని ఎత్తు లేదని, అందుకొని అవకాశం లేదని ఎమ్మెల్యే తెలిపారు.

కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, జిల్లాలో ఆర్టీసీ బస్సులు, మహిళా మార్ట్, డెయిరీ షెడ్డులు, చాలా యూనిట్లు ఏర్పాటు చేశామని, ఇదంతా మహిళల పొదుపుతోనే సాధ్యమైందని అన్నారు. ఒక మహిళను చదివిస్తే ఒక కుటుంబం, తరం బాగు పడుతుందని, అదే ఒక పురుషుణ్ణి చదివిస్తే, అతను మాత్రమే బాగుపడతాడని అన్నారు. ఒక మహిళ చేతిలో డబ్బు అందితే, అది అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇప్పుడు మహిళలు ఇన్వెస్టర్ స్థాయికి వెళ్లారని, కుటుంబాలు బాగుపడాలని, పిల్లలు బాగా ఎదగాలని అన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు అశ్విని మాట్లాడుతూ, తాను డబల్ బెడ్ రూమ్ కు అన్ని అర్హతలు కల్గివున్నానని, గత ప్రభుత్వంలో ఎన్నో సార్లు జాబితా లో మొదటగా తన పేరు వచ్చిన, తుది జాబితాలో తన పేరు ఉండేది కాదని అన్నారు. ఎవ్వరిని అడిగిన సమాధానం ఉండేది కాదని, స్వంత ఇల్లు లేక, కిరాయి ఇంట్లో, కొద్దిపాటి సంపాదనతో ఎన్నో ఇబ్బందులు పడ్డానని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాగానే, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిందని, బేస్మెంట్ లెవల్ నిర్మాణం పూర్తి కాగానే, మొదటి విడత డబ్బులు పడ్డాయని, చాలా సంతోషంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు.

మరో లబ్దిదారు మర్లపాడు గ్రామం నుండి కుమారి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం లో వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘ సభ్యులకు భీమా, ప్రమాద భీమా కల్పించిందని తెలిపారు. ఇంతకుముందు తన దగ్గర ఏమీ లేవని, ఇప్పుడు ఇద్దరమ్మాయిలను బాగా చదివించి, పెళ్లిళ్లు చేసినట్లు, అమ్మాయిని అమెరికా పంపినట్లు సంతోషంగా తెలిపారు.

కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గంలోని 4819 స్వయం సహాయక సంఘాల సభ్యులకు 5 కోట్ల 68 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను, లోన్ భీమా క్రింద 45 మంది సభ్యులకు గాను రూ. 46.87 లక్షల చెక్కును సభ్యుల సంఘాలకు, ప్రమాద భీమా క్రింద ఇద్దరు సభ్యుల నామినీ ఖాతాల్లో 10 లక్షల చొప్పున 20 లక్షలు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు డిఆర్డీవో జయశ్రీ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలత, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, జిల్లా క్రీడలు, యువజన సంక్షేమ శాఖ అధికారి సునీల్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, సత్తుపల్లి నియోజకవర్గ తహసీల్దార్లు, ఎంపిడివో లు, కల్లూరు, సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్లు, మండల సమాఖ్య సభ్యులు, ఏ.పి.ఎం.లు, మహిళలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి...

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధి 37వ డివిజన్ లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూలై- 17:** నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.

మంత్రి గురువారం ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధి 37వ డివిజన్ లో మునిసిపల్ సాధారణ నిధులు రూ. 175 లక్షలతో రైల్వే స్టేషన్ దగ్గర్లో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలం లో పూర్తి చేయాలని తెలిపారు. ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా తమ వంతు సహకారం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు పెద్ద ఎత్తున నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్ల వెడల్పుతో నగరం సుందరంగాను, ప్రజలకు సౌకర్యవంతంగాను ఉంటుందన్నారు. రోడ్ల వెడల్పు తో ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సైకియాట్రిస్ట్ మరియు సపోర్ట్ ఇంజనీర్స్ పోస్ట్ ల సెలక్షన్ లిస్ట్ జిల్లా వెబ్ సైట్ లో సిద్ధం



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం:** సైకియాట్రిస్ట్ పోస్ట్ మరియు సపోర్ట్ ఇంజనీర్స్ పోస్ట్ ల సెలక్షన్ లిస్ట్ జిల్లా వెబ్ సైట్ లో సిద్ధం . జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. కళావతి బాయి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖలో జాతీయ ఆరోగ్యమిషన్ విభాగంలో తాత్కాలిక అవుట్ సోర్సింగ్ పద్ధతిలో సైకియాట్రిస్ట్ పోస్ట్ మరియు సపోర్ట్ ఇంజనీర్స్ పోస్ట్ ల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సెలక్షన్ లిస్టులు జిల్లా వెబ్సైటు %ట్ట్రజూం://న్ఝ్ఖుఎఝివ్.వశ్రీఖఅస్త్రుఅఖ.ద్రశీజ.ఱఅ% లో పెట్టడం జరిగింది. కావున అభ్యర్థులు సెలక్షన్ లిస్టులో ఏమైనా అభ్యంతరాలు వుంటే, అభ్యర్థులు తేది : 18.07.2025 ఉదయం 10.30 గం.ల నుండి తేది : 20.07.2025, సా. 5 గం. వరకు, అప్లికేషన్ తో పాటు

సంబందిత డాక్యుమెంట్ ప్రూఫ్ లు జతపరచి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం, ఖమ్మం, లో సమర్పించగలరని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. కళావతి బాయి తెలిపారు.

# మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం...

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ దృఢ సంకల్పం
- కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- పాలేరు నియోజకవర్గంలోని 4585 స్వయం సహాయక సంఘాల సభ్యులకు 5 కోట్ల 62 లక్షల వడ్డీ లేని రుణాల చెక్కులు
- పాలేరు నియోజకవర్గం స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి పాల్గొన్న మంత్రి పొంగులేటి.

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం/కూసుమంచి, జూలై -17:** మహిళల ఆర్థిక సాధికారతే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని, ఏ దిశగా దృఢ సంకల్పం తో ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

మంత్రివర్యులు, గురువారం కూసుమంచి మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ ఆవరణలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి పాలేరు నియోజకవర్గం స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో పాల్గొని వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ భీమా, ప్రమాద భీమా చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేసారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంతో తల్లికి కొడుకుకి ఉన్న అవినాభావ సంబంధం నాకు ఉందన్నారు. మీ దీవెనలతో 18 నెలల క్రితం ఇక్కడి నుంచి కనివివి ఎరుగని మెజారిటీ తో నన్ను గెలిపించారన్నారు. రావణాసుర పరిపాలన వద్దు అని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ 2023 డిసెంబర్ లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ కి అధికారం కట్టబెట్టారన్నారు.

పేదోడికి భరోసా ఇవ్వడంలో ఆనాటి ప్రభుత్వం విఫలమైందని, కానీ పేదవాడి పక్షపాతిగా ఈ 18 నెలల నుంచి ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి అన్నారు. పేదవాడి పక్షపాతిగా ఎలా నడుచుకుంటున్నమో చెప్పడానికే రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను నిర్వహిస్తుందని తెలిపారు.

ఆనాటి ప్రభుత్వం బెల్ట్ షాపులు పెట్టి ప్రోత్సహిస్తే, మీరు ఎంచుకున్న ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులను ఇచ్చిందని మంత్రి అన్నారు. రెండు రోజుల క్రితమే రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డుల పంపిణీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తుంగతుర్తిలో ప్రారంభించుకున్నామన్నారు. 5 లక్షల 65 వేల కొత్త రేషన్ కార్డులను ఈ ప్రభుత్వం ఇస్తుందని, 16 లక్షల మంది పేర్లు రేషన్ కార్డుల్లో చేర్పులు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఆనాటి ప్రభుత్వం పదేళ్ళలో 90 వేల ఇండ్లు మంజూరు చేసి, 60 వేల ఇండ్లు మాత్రమే పూర్తి చేసిందని, మిగతా 30 వేలు మొండి గోడలతో అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. అంటే సగటున గడిచిన పదేళ్లలో ఆనాటి ప్రభుత్వం హయంలో ఏడాదికి కేవలం 6 వేల ఇళ్లు మాత్రమే పేదలకు ఇచ్చారన్నారు. ఈనాటి ఇందిరమ్మ ప్రభుత్వంలో మొదటి విడతలోనే ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా రాబోవు మూడు విడతల్లోనూ అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ఎవరూ కూడా ఇల్లు రాలేదని ఆభద్రతకు లోను కావొద్దన్నారు. పాలేరు నా ఇల్లు ప్రతీ ఒకరికి ఇల్లు ఇచ్చే బాధ్యత నాదని మంత్రి అన్నారు.

కులం, మతం, పార్టీలకు అతీతంగా పేదవాడు ఐతే చాలు ఇందిరమ్మ ఇళ్ళు, సంక్షేమ పథకాలను అందించే బాధ్యత తనదని తెలిపారు.

గత ప్రభుత్వం రైతుని రాజు చేస్తామని చెప్పి పదేళ్లలో కేవలం రూ.17 వేల కోట్ల రుణ మాఫీ చేస్తే, ఇందిరమ్మ ప్రభుత్వం కేవలం 10 నెలల్లోనే 20 వేల కోట్లకు పైగా రైతు రుణమాఫీ చేసి చూపిందన్నారు. రైతు భరోసా ను ఎకరాకు 10 వేల నుండి 12 వేలకు పెంచి, 9 రోజుల్లోనే 9 వేల కోట్లను రైతు ఖాతాల్లో జమ చేసిందన్నారు. సన్నాలకు మద్దతు ధర తోపాటు, 500 రూపాయల బోనస్ ఇచ్చి రైతును రాజు చేసింది.

నిరుద్యోగ యువతకు అన్న మాట ప్రకారం 50 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామన్నారు. రాబోయే కొద్ది కాలంలోనే మరిన్ని ఉద్యోగాలు ఇస్తామని, కేవలం రెండేళ్ల లోనే లక్ష ఉద్యోగాలు ఇస్తామని, ఇలా దేశంలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వం, చివరికి కేంద్ర ప్రభుత్వం కూడా ఇవ్వలేదని మంత్రి తెలిపారు.

హాస్టల్ లలో మెస్ ఛార్జీలు 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలు 200 శాతం పెంచి, పిల్లలకు మంచి ఆహారం అందిస్తున్నామన్నారు.

200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 లకే వంట గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్య శ్రీ రూ.10 లక్షలకు మన ప్రభుత్వం పెంచిందన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మన ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ధాన్యం కొనుగోలు, ఆర్టీసీ అద్దె బస్సుల బాధ్యత నిర్వహణ కూడా మహిళా సంఘాలకు ఇవ్వాలన్నదే మన ప్రభుత్వం ధ్యేయమని తెలిపారు. మహిళా సంఘాల నుంచే ఆడబిడ్డలు ఇందిరమ్మ ఇళ్లు కట్టు కోవడానికి రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, పాలేరు నియోజకవర్గంలోని 4585 మహిళా సంఘాలకు 5 కోట్ల 62 లక్షల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. గత సంవత్సరం మొదలైన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అంచెలంచెలుగా ఎదిగి, ఎన్నో విజయాలు సాధించిందన్నారు. అద్దె ఆర్టీసీ బస్సులు, ఇసుక రీచ్ ల నిర్వహణ, స్త్రీ టీ, షీ రాక్స్ కేంద్రాలు ఎన్నో ఏర్పాటయి, మహిళలు ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడి, ఆర్థిక సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. రుణాలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు.

రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ 14 జూలై న సీఎం తుంగతుర్తి లో ప్రారంభించారన్నారు. జిల్లాలో 19 వేల 400 పై చిలుకు కొత్త కార్డులు ఇస్తున్నామన్నారు. కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి మనిషికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ప్రతి నెల అందిస్తున్నామన్నారు. అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, సంక్షేమ గురుకులాల్లోనూ పిల్లలకు సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గంలోని 4585 స్వయం సహాయక సంఘాల సభ్యులకు 5 కోట్ల 62 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను, లోన్ భీమా క్రింద 56 మంది సభ్యులకు గాను రూ. 44.90 లక్షల చెక్కును సభ్యుల సంఘాలకు, ప్రమాద భీమా క్రింద 5 గురు సభ్యుల నామినీ ఖాతాల్లో 10 లక్షల చొప్పున 50 లక్షలు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో డిఆర్డీవో ఎన్. సన్యాసయ్య, డిఎం సివిల్ సప్లయిస్ శ్రీలత, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, నియోజకవర్గ తహసీల్దార్లు, ఎంపిడివో లు, , మండల సమాఖ్య సభ్యులు, ఏ.పి.ఎం.లు, మహిళలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## జంగాలపల్లి కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాలలో షి టీమ్ అవగాహన సదస్సు



సికే న్యూస్ వాజేడు మండల ప్రతినిధి: షేక్ రహీమ్ : ములుగు జిల్లా వాజేడు మండలంలోని జంగాలపల్లి కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాలలో ఈ రోజు విద్యార్థులకు షీ టీం వాళ్లు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా షీటీం ఎస్సై కాంతారావు కానిస్టేబుల్ మిరాజ్ స్వాతి, బాలు మాట్లాడుతూ

మహిళలు, బాలికల పై అసభ్యకరంగా ప్రవర్తించే ఆకతాయిల ఆగడాలు అరికట్టే లక్ష్యంతో షి టీమ్ పని చేస్తుందనీ తెలిపారు.

మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని షి టీం పై మహిళలు, బాలికలకు అవగాహన లేకపోవడంతో సమస్యల్లో చిక్కుకుపోతున్నారని, మహిళల భద్రతే షి టీం లక్ష్యం అని తెలిపారు.

సాంకేతికత లోపంతో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, మొబైల్ ఫోన్లో ఈజీ మనీ కోసం, ఓటీపీలు వంటి వాటితో మన సేవింగ్ అకౌంట్ నుంచి డబ్బులు కాజేస్తున్నారని, డబ్బులు ఎకౌంట్స్ నుంచి కట్ అయిన గంట సమయంలోపు పోలీస్ శాఖను సంప్రదించాలని తెలిపారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 5 నుంచి రాజీవ్ గాంధీ మెమోరియల్ టోర్నమెంట్..

- టోర్నమెంట్ లో పాల్గొననున్న పాఠశాల బాలురు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అండర్ 12,14, 16 విభాగాలకు టోర్నమెంట్లు..





సికె న్యూస్ ప్రతినిధి:ఖమ్మం జూలై 17 ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే బాలురలకు క్రికెట్ క్రీడపై ఆసక్తిని పెంపొందింప చేసేందుకు ఖమ్మం క్రికెట్ అసోసియేషన్ సారథ్యంలో రాజీవ్ గాంధీ మెమోరియల్ ట్రోఫీ టోర్నమెంట్ పేరుతో ఆగస్టు 5వ తేదీ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు మహమ్మద్ మతీన్, నిరంజన్, ప్రసాద్, శ్రీనులు పేర్కొన్నారు..రాజీవ్ గాంధీ మెమరీయల్ ట్రోఫీను అండర్ 12, అండర్ 14, అండర్ 16 కేటగిరీలలో టోర్నమెంట్లను ఉమ్మడి ఖమ్మం జిల్లాలలో క్రికెట్ క్రీడా పోటీల నిర్వహణ కోసం తీర్మానం చేసినట్లు వారు వెల్లడించారు.. ఖమ్మంలో అండర్ 12 కేటగిరి, కొత్తగూడెంలో అండర్ 14, కల్లూరులో అండర్ 16 విభాగాలలో క్రీడాపోటిల నిర్వహణ వుంటుందని తెలిపారు. అండర్ 14 విభాగానికి నిరంజన్ 9182800880, అండర్ 16 ఇమ్రాన్, 9701633374, ఖమ్మం వీరేందర్ సిద్దు 9550072331,
శ్రీనివాస్ 9959824933

నంబర్లకు ఆసక్తి గలవారు సంప్రదించాలని వారు కోరారు. ఆధార్ కార్డ్, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. టోర్నమెంట్ తీర్మాన సమావేశ%శీ%లో ముఖ్య అతిథులు ఆర్టిఏ డైరెక్టర్ వెంకన్న, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఫరీద్ ఖాద్రి, రాజీవ్ గాంధీ ట్రోఫీ కన్వీనర్లు అన్ని మండలాల కన్వీనర్లు, 14 మంది ఇన్చార్జిలు తదితరులు పాల్గొనగా సాయి నిరంజన్, శ్రీనివాస్, ప్రసాద్, ఇమ్రాన్, శ్రీకాంత్ కిషన్ సుభద్ర, సురేందర్, నరేందర్, మొయినుద్దీన్, వీరేందర్ నసీమా,సంధ్య, రాగిని, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యూ ఐ కార్యకర్తలు, సీనియర్ క్రికెట్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు..

## షాద్ నగర్ రెండవ వార్డు లో రంగ రంగ వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు



సి కే న్యూస్ షాద్ నగర్:జులై 17: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లోని రెండవ వార్డ్ ఆఫీసర్స్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, నోబుల్ పార్క్ కాలనీ భాగ్యనగర్ కాలనీ వాసులు అందరూ కలిసి పోచమ్మ తల్లి బోనాలు రంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో పోతురాజు విన్యాసాలు,శివసత్తులతో ఎంతో హోలుదకరంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజన చట్టాలు గిరిజన జిల్లాలో వర్తించవా ?







- అధికారుల అండదండలతో జి ప్లస్ త్రీ నిర్మాణాల జోరు.
- గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ అధికారుల అండతో నిర్మాణాలు.
- మమ్మల్ని ఎవరు ఏమి చేయలేరంటూ జి ప్లస్ త్రీ అక్రమ నిర్మాణదారుల జోరు
- అధికారుల కంటికి కనిపించని లక్ష్మీదేవి పల్లి మండలం కార్యాలయం పక్కనే జి ప్లస్ త్రీ నిర్మాణం.
- అన్నీ తెలిసి చోద్యం చూస్తున్న అధికారులు.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ లక్ష్మీదేవి పల్లి ప్రతినిధి,( సాయి కౌశిక్),జూలై 17, లక్ష్మీదేవి పల్లె మండలంలో అధికారుల అండదండలతో జి ప్లస్ త్రీ అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి అనడంలో డబ్బులు ఎటువంటి సందేహం లేదు. లక్ష్మీదేవి పల్లి మండలంలో నేషనల్ హైవే రోడ్డు పక్కన మండల కార్యాలయం ప్రక్కన జి ప్లస్ త్రీ అక్రమ నిర్మాణాల విషమై వార్త తరంగాలు ప్రతినిధి పలుమార్లు పంచాయతీ సెక్రటరీకి ఎంపీఓకి డిఎల్పిఓకి వివరణ కొరకు ఫోను చేసినప్పటికీ ఫోను ఎత్తకుండా ఉండడం చూస్తుంటే కచ్చితంగా అధికారుల అండ దండలతో జి ప్లస్ త్రీ నిర్మాణాలు కొనసాగుతున్నాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు వివరణ కొరకు పలుమార్లు ఫోను చేసిన స్పందించని అధికారులు . ప్రజలకు ఎటువంటి సందేశాన్ని ఇస్తున్నారు అర్థం కాని పరిస్థితి. ఏజెన్సీ చట్టాలను లెక్కచేయకుండా జి ప్లస్ త్రీ నిర్మాణాలు చేస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏంటో అర్థం కాని పరిస్థితి. గిరిజన చట్టాలంటే అధికారులకు లెక్క లేదా ? లేక మమ్మల్ని ఎవరు ఏం చేస్తారు లే అని ధీమాతో అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారా అని చర్చించుకుంటున్న ప్రజలు. ప్రజా ప్రభుత్వంలో గిరిజన చట్టాలు గిరిజన జిల్లాలో వర్తించవా లేక గిరిజన జిల్లే కదా అని చిన్నచూపు చూస్తున్నారా ఈ అధికారులు. మే నెల నుండి పలు దినపత్రికలలో ప్రచురించినప్పటికీ జి ప్లస్ అక్రమ నిర్మాణ దారుల అక్రమ నిర్మాణాలను ఆపే అధికారి లేరా లేక అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్క యారా అని చర్చించుకుంటున్న లక్ష్మీదేవి పల్లి ప్రజలు. ఇప్పటికైనా ఏజెన్సీ జిల్లాలో జరుగుతున్న జి ప్లస్ త్రీ నిర్మాణాలను నిలుపుదల చేసి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న జి ప్లస్ త్రీ నిర్మాణదారులపై వాటికి సహకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి ఎంపీ ఓ లపై తగిన చర్య తీసుకోవాలని కోరుతున్న పలువురు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి జి ప్లస్ త్రీ నిర్మాణాలు నిలుపుదల చేసి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు.

# అమ్మలగన్నమ్మ తల్లి ఆదిపరాశక్తి అందరినీ చల్లంగా చూడవమ్మా



సోలిపూర్ 5 వార్డులో దేవాలయంలో బోనాల ఉత్సవాలు

ఉత్సవాలలో పాల్గొన్న మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్

సి కే న్యూస్ షాద్ నగర్:జులై 17: అమ్మల గన్న అమ్మ తల్లి ఆదిపరాశక్తి అందరిని చల్లంగా చూడాలని, అమ్మవారి దీవెనలు ఈ రాష్ట్ర ప్రజలందరికీ ఆకాంక్షించారు ఈ రోజు షాద్ నగర్ పట్టణంలో సోలిపూర్ 5 వార్డులో గూడెం మైసమ్మ దేవాలయం యొక్క బోనాలలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్ సింగపాగ లక్ష్మయ్య మాజీ వార్డు సభ్యులు వెంకటేష్ గౌడ్ ఆంజనేయులు గౌడ్ మున్నూరు నరేందర్. పి బాలరాజ్ అనిల్ కుమార్ (టిల్లు) రాజు నాయక్ లక్ష్మయ్య పాల్గొని బోనాల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొని అమ్మ వారి ఆశీర్వాదం తీసుకొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి కృప కరుణ కటాక్షాల వలన వర్షాలు సమృద్ధిగా కృషి రైతన్నల ఇంటి లోగిళ్ళన్ని సమృద్ధిగా నిండాలని, కార్మికుల కర్షకుల జీవితాలు బాగుండాలని, విద్యార్థిని విద్యార్థులు ఉన్నత చదువులలో ఎదగాలని, రాష్ట్రం తో పాటు నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో వెలుగొందాలని, అధికారులు అనధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, మహిళా మణులు అందరూ అత్యద్భుతమైన రీతిలో రాణించాలని, నియోజకవర్గ మొత్తం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆ అమ్మవారిని వేడుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి పథంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం...

- యాచారం మాజీ ఎంపీపీ రమావత్. జ్యోతి శ్రీనివాస్ నాయక్


యాచారం జులై 17 సి కే న్యూస్ ప్రతినిధి :

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారు ఎందుకంటే గౌరవ ఎమ్మెల్యే శ్రీ మల్రెడ్డి రంగారెడ్డి గారి చొరవతో నియోజవర్గంలోని చాలా అభివృద్ధి పనులు చేసుకోవడం జరుగుతుంద నీ మాజీ ఎంపీపీ రమావత్ జ్యోతి శ్రీనివాస్ నాయక్ అన్నారు గురువారం అమె మాట్లాడుతూ గత ప్రభుత్వం చేయనటువంటి మా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక గత ప్రభుత్వ వైఫల్యాలను గమనించి రాష్ట్ర ప్రజలు మార్పును కోరి ఇందిరమ్మ రాజ్యం కోసం కాంగ్రెస్ పార్టీని అధికారం ఇచ్చారు. తత్ ఫలితంగా గౌరవనీయులు ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది ప్రజల ఆకాంక్షలతో కాంగ్రెస్ పార్టీ ఆశయాలను సమన్వయపరిచి ఎన్నికల ముందు మేము ఇచ్చిన హామీలను అభివృద్ధి కార్యక్రమాలను అమలు పరచాలని దృఢదీక్షతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం. మేము ఇచ్చిన హామీలు ఎన్నికల్లో ఏదో విధంగా గెలవాలని ఉద్దేశంతో ఇచ్చిన కావు. ప్రజల్లో గుండె చప్పుడులతో స్పందించి రూపొందించినవే. మా హామీలు అలాగే కానీవని ప్రతిపక్షాలు పదేపదే విమర్శలు చేస్తుండడం గమనార్హం. సంకల్ప బలం చిత్తశుద్ధి సమర్థత నిజాయితీ పునాదులుగా నిర్మితమైన మా ప్రభుత్వాన్ని అలావి కానివి లేవని నిరూపించాము. ఎందుకు తొలిమెట్టుగా రాష్ట్ర మహిళలు అందరికీ ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించాం ఆరోగ్య శ్రీ పథకం కింద అర్హులైన వారందరికీ వైద్య ఖర్చులు నిమిత్తం ఐదు లక్షల నుంచి పది లక్షల రూపాయలను పెంచాం మా ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం మహాలక్ష్మి పథకం కింద 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్లు అర్హులైన వారందరికీ సరఫరా చేస్తున్నాము. పేదలకు సొంతింటి కల నెరవేర్చే ఇందిరమ్మ ఇండ్లు పథకం ప్రారంభించి ప్రతి గ్రామంలో ఇల్లు ప్రతి పేదవాడు ఇల్లు నిర్మించుకొని సంతోషంగా ఉండాలని మా ప్రభుత్వ లక్ష్యం. అలాగే నెలకు 200 యూనిట్ విద్యుత్తు అర్హులైన వినియోగదారులకు ఉచితంగా ఇస్తున్నాము ఈ పథకాలన్నీ మా ప్రభుత్వంలో



ఏర్పడిన కొద్ది రోజుల్లో మేము ఇచ్చిన హామీలను అనుగుణంగా అమలుపరిచాం. ఇది మా నిజాయితీకి నిదర్శనం రైతుల కళ్ళల్లో ఆనందాన్ని చూసి రైతు భరోసా పథకం ద్వారా రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయడం జరిగింది. ఎన్నికల సమయంలో ఇందిరమ్మ రాజ్యాన్ని తెలంగాణలో స్థాపిస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికి నిరంతరం కృషి చేసిన మా ఎమ్మెల్యే గౌరవ శ్రీ మల్రెడ్డి రంగారెడ్డి గారికి నియోజకవర్గ ప్రజలు ధన్యవాదాలు తెలుపుకుంటున్నారు. మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్రెడిట్ కార్డు యాక్టివేషన్ మోసం: నిమిషాల్లో 1.42 లక్షలు మాయం



క్రెడిట్ కార్డు యాక్టివేషన్ పేరుతో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై ముంబై పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గత నెల మే 3 నుంచి మే 30 మధ్య, ముంబై నగరంలో కనీసం 19 మందికి పైగా క్రెడిట్ కార్డు దారులు ఈ మోసగాళ్ల వలలో చిక్కుకుని ?8 లక్షలకు పైగా నష్టపోయినట్లు అధికారులు తెలిపారు. బాధితుల్లో ఒక్కొక్కరు ?20,554 నుంచి గరిష్ఠంగా ?1.42 లక్షల వరకు కోల్పోయినట్లు సమాచారం.

**మోసగాళ్ల కొత్త పంథా: కాలర్ ఐడీ స్పూఫింగ్**

ఈ మోసగాళ్లు అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. "మీ కొత్త క్రెడిట్ కార్డును యాక్టివేట్ చేయాలి" అంటూ బ్యాంకు ఉద్యోగులుగా నమ్మబలికిన మోసగాళ్లు, కాలర్ ఐడీ స్పూఫింగ్ ద్వారా తమ ఫోన్ నంబర్లను బ్యాంకుల అధికారిక హెల్ప్‌లైన్ నంబర్ల మాదిరిగా కనిపించేలా చేశారు. కాల్‌కు స్పందించిన బాధితుల నుండి క్రెడిట్ కార్డు నంబర్, పిన్ ( , వన్-టైమ్ పాస్‌వర్డ్ వంటి కీలక సమాచారాన్ని చాకచక్యంగా రాబట్టారు. ఈ వివరాలు అందగానే, నిమిషాల వ్యవధిలోనే బాధితుల బ్యాంక్ ఖాతాల నుండి డబ్బును కొల్లగొట్టి, పలు ఆన్‌లైన్ లావాదేవీలకు పాల్పడినట్లు పోలీసులు వివరించారు.

**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు: సైబర్ పోలీసుల సూచనలు**

సైబర్ నేరగాళ్ల నుండి తమను తాము రక్షించుకోవడానికి ప్రజలు ఈ క్రింది సూచనలను తప్పకుండా పాటించాలని సైబర్ క్రైమ్ విభాగం కోరింది. బ్యాంకులు లేదా ఏ ఆర్థిక సంస్థ కూడా ఫోన్ కాల్స్, SMS లేదా ఈమెయిళ్ల ద్వారా మీ CVV, PIN, OTP వంటి వ్యక్తిగత వివరాలను ఎప్పటికీ అడగవు. అలాంటి కాల్స్ వస్తే వెంటనే ఫోన్ కట్ చేయండి. బ్యాంకు నుండి వచ్చిందని మీకు అనుమానం కలిగించే ఏదైనా కాల్ లేదా మెసేజ్ వస్తే, వెంటనే మీ బ్యాంక్ అధికారిక హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి వివరాలను ధృవీకరించండి. మీకు వచ్చిన నంబర్‌కు తిరిగి కాల్ చేయవద్దు. మీ SMS మరియు ఈమెయిల్ అలర్ట్‌లను ఎల్లప్పుడూ ఆన్‌లో ఉంచుకోండి. మీ క్రెడిట్ కార్డు లేదా బ్యాంక్ ఖాతాలో జరిగే ప్రతి లావాదేవీని నిరంతరం పర్యవేక్షించండి. ఏదైనా అనుమానాస్పద లావాదేవీని గమనిస్తే వెంటనే చర్య తీసుకోండి. మీకు అవసరం లేనప్పుడు అంతర్జాతీయ లేదా కాంటాక్ట్‌లెస్ లావాదేవీలను నిలిపివేయండి. మీ కార్డుపై గరిష్ఠ లావాదేవీ పరిమితులను సెట్ చేసుకోవడం ద్వారా మోసం జరిగినా నష్టాన్ని తగ్గించుకోవచ్చు.

**మోసపోయినట్లయితే తక్షణ చర్యలు:**

ఒకవేళ ఎవరైనా ఈ తరహా మోసానికి గురైనట్లయితే, తక్షణమే ఈ క్రింది చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వెంటనే మీ బ్యాంకుకు ఫోన్ చేసి, మీ క్రెడిట్ కార్డును బ్లాక్ చేయమని కోరండి. అనధికార లావాదేవీల గురించి తెలియజేయండి. భారత ప్రభుత్వ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయండి. వెబ్‌సైట్: cybercrime.gov.in.. హెల్ప్‌లైన్: 1930

ఈ మోసానికి గురైనవారిలో వృత్తిపరులు, వ్యాపారులు, తల్లిదండ్రులు ఉన్నారని, ఇది ఎవరికైనా జరగవచ్చని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, సైబర్ మోసగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# బాలయ్యకు జగన్ వరం.. హిందూపురంలో ఇక అన్ స్టాపబుల్!



హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణకు వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి బంపర్ ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. 1983 నుంచి టీడీపీకి కంచుకోట వంటి హిందూపురంలో వైసీపీ అంతర్గత విభేదాలతో సతమతమవుతోంది. అయితే నేతల మధ్య భేదాభిప్రాయాలను చక్కదిద్ది పార్టీని బలోపేతం చేయాల్సిన వైసీపీ అధినేత, అందుకు విరుద్ధమైన నిర్ణయం తీసుకున్నట్లు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. హిందూపురంలో టీడీపీకి చిరకాల ప్రత్యర్థిగా పోరాడుతున్న నవీన్ నిశ్చల్, ఆయన అనుచరుడు వేణుగోపాలరెడ్డిని వైసీపీ సస్పెండ్ చేసింది. దీంతో వైసీపీ సమన్వయకర్త దీపికకు లైన్ క్లియర్ చేసినట్లు వైసీపీ భావిస్తున్నా, ఈ పరిణామం టీడీపీకి ముఖ్యంగా సినీనటుడు ఎమ్మెల్యే బాలకృష్ణకు కలిసివస్తుందన్న విశ్లేషణలే వ్యక్తమవుతున్నాయి. హిందూపురంలో బాలకృష్ణ మూడుసార్లు గెలిచారు. 1983లో టీడీపీ ఆవిర్భావం నుంచి ఈ స్థానం టీడీపీకి కంచుకోటగా చెబుతారు. 1985లో అప్పటి ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ హిందూపురంలో పోటీ చేసి గెలిచారు. ఇక అప్పటి నుంచి ఆయన హిందూపురంనే తన కోటగా మార్చుకున్నారు. ఎన్టీఆర్ వరుసగా మూడుసార్లు, ఆయన తర్వాత ఆయన కుమారుడు హరికృష్ణ ఒక సారి, ఆ తర్వాత బాలకృష్ణ మూడు సార్లు ఇక్కడ నుంచి గెలిచారు. మధ్యలో 1999 నుంచి 2009 ఎన్నికల వరకు మూడుసార్లు ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు కాకుండా, స్థానిక నేతలకు పార్టీ అవకాశం ఇచ్చింది. ఇక 2014లో బాలకృష్ణ ఆరంగేట్రం చేశాక హిందూపురం ఆయన అడ్డాగా మారింది. ఇదే సమయంలో 2004 నుంచి స్థానిక నేత నవీన్ నిశ్చల్ టీడీపీకి గట్టిపోటీనిస్తూ వచ్చారు. తొలుత కాంగ్రెస్, ఆ తర్వాత వైసీపీ నుంచి పోటీ చేసిన ఆయనను 2019 ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు. బాలయ్యపై పోలీసు అధికారి ఇక్బాల్ ను పోటీకి పెట్టింది వైసీపీ. అదేవిధంగా 2024 ఎన్నికల్లో సైతం నవీన్ నిశ్చల్ ను కాదని తిప్పేగౌడ నారాయణ్ దీపిక అనే మహిళా నేతను రంగంలోకి దింపింది.

2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇక్బాల్ ను ఎమ్మెల్సీ చేస్తే, ఆయన గత ఎన్నికల ముందే టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అదేసమయంలో టికెట్ నిరాకరించినా టీడీపీ వ్యతిరేక భావజాలంతో నవీన్ నిశ్చల్ పార్టీనే అంటిపెట్టుకుని ఉన్నారు. 2004 నుంచి 2014 వరకు నాలుగు సార్లు పోటీ చేసి ఓడిపోయిన నవీన్ నిశ్చల్ కు హిందూపురంలో గట్టి పట్టు ఉంది. అయితే టీడీపీ బలం, నందమూరి కుటుంబ ప్రభావంతో ఆయన నెగ్గుకురాలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన ఉంటే తమకు గుర్తింపు ఉండదన్న కారణంగా వైసీపీలో ఆయన ప్రత్యర్థులు నవీన్ నిశ్చల్ కు పొగబెట్టారని అంటున్నారు. గత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు సహకరించలేదని నవీన్ నిశ్చల్ పై దీపిక వర్గం గుర్రుగా ఉంది. ఈ నేపథ్యంలోనే ఏడాదిగా హిందూపురంలో వైసీపీ రెండు వర్గాలుగా విడిపోయిందని అంటున్నారు.

ఇక ఈ నెల 8న జరిగిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జయంతి వేడుకల్లో ఈ విభేదాలు మరోమారు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. వచ్చే ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని వైఎస్ జయంతి కార్యక్రమంలో ప్రకటించడంతో దీపిక వర్గం షాక్ తిన్నట్లు చెబుతున్నారు. అయితే ఈ విషయంలో జోక్యం చేసుకుని, అలాంటి ప్రకటనలు చేయొద్దని నవీన్ నిశ్చల్ ను సర్ది చెప్పాల్సిన వైసీపీ అధిష్టానం ఏకంగా ఆయనను పార్టీ నుంచి బహిష్కరించింది. పార్టీకి ఏ మాత్రం బలం లేని హిందూపురం వంటి నియోజకవర్గాల్లో సీనియర్లను కాపాడుకుంటూ బలం పుంజుకోవాల్సింది పోయి ఇలా బటయకు పంపడంపై కార్యకర్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామం ప్రత్యర్థి, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు కలిసివస్తుందని వైసీపీ శ్రేణులే వ్యాఖ్యానిస్తున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గంలో అభివృద్ధి పనులతో దూసుకుపోతున్నారు. తనకు ప్రత్యర్థులే లేకుండా ఉండేలా పావులు

కదుపుతున్నారు. గత ఎన్నికల ముందు మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ ను పార్టీలో చేర్చుకున్న బాలకృష్ణ... నవీన్ నిశ్చల్ విషయంలోనూ అదే నిర్ణయం తీసుకుంటారా? అనే చర్చ మొదలైంది. హిందూపురం నియోజకవర్గంలో పార్టీ ఇప్పటికే బలంగా ఉందనే అభిప్రాయం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యర్థి శిబిరం నుంచి ప్రధాన నేతలు వస్తే ఎవరైనా కాదంటారా? అని అంటున్నారు. అయితే తన రాజకీయ జీవితం మొత్తం టీడీపీపై పోరాడటానికే కేటాయించిన నవీన్ నిశ్చల్.. ఇప్పుడు భవిష్యత్తు కోసం టీడీపీతో చేతులు కలుపుతారా? లేక జనసేన, బీజేపీల్లో చేరతారా? అనేది చర్చకు తావిస్తోంది. మూడు పార్టీల్లో ఎటువైపు ఆయన మొగ్గినా వైసీపీకి మరింత ఇబ్బందే అంటున్నారు. ఇదే సమయంలో బాలయ్యకు అంతా కలిసివచ్చినట్లేనని అంటున్నారు.

# మీకు 'రిటర్న్ ట్రిప్ ఎఫెక్ట్' ఉందా?.. ఎందుకు ఉందంటే..?



ఎక్కడికైనా ప్రయాణించిన సమయాల్లో.. వెళ్లినప్పుడు మాత్రం చాలా దూరం ప్రయాణించినట్లు అనిపిస్తూ, వచ్చేటప్పుడు మాత్రం 'త్వరగా వచ్చేశామూ అనే అనుభూతి చాలా మందికి చాలా సందర్భాల్లో కలిగి ఉంటుంది. దీనినే 'రిటర్న్ ట్రిప్ ఎఫెక్ట్' అంటారు. అయితే, ఈ భావన కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు స్పష్టంగా అనిపిస్తుందని అంటున్నారు.

ఆవును... రోజూ ప్రయాణాలు చేసే ఆఫీసు వంటి తెలిసిన చోట్లకు చేసే ప్రయాణాల సంగతి అలా ఉంచితే... ఎప్పుడైనా దూరం ప్రయాణాలు చేసిన సమయంలో వెళ్లినప్పుడు స్లోగా.. వచ్చేటప్పుడు ఫాస్ట్ గా ప్రయాణం జరిగిందనే భావననే రిటర్న్ ట్రిప్ ఎఫెక్ట్ అంటారు. ఈ భావన ఏర్పడటానికి గల కారణాలను వైద్యులు వెల్లడిస్తున్నారు.

ఇందులో భాగంగా... ఎక్కడికైనా వెళ్తున్నప్పుడు ఆ ప్రాంతం కొత్తది అయితే ప్రతీ విషయాన్ని చూసుకుంటూ, గుర్తుపెట్టుకునే ప్రయత్నం చేస్తూ వెళ్తుంటామని.. అందుకే సమయం ఎక్కువ పట్టినట్లు అనిపిస్తుందని.. అయితే, తిరిగి వస్తున్నప్పుడు ఆ మార్గం తెలిసిందే కాబట్టి అంతగా పట్టించుకోమని.. అందుకే మెదడుకు కాస్త రిలాక్స్ ఇవ్వడంతో త్వరగా వచ్చేసినట్లు అనిపిస్తుందని చెబుతున్నారు. ఒక చోటుకి వెళ్లేటప్పుడు ఆ ప్రదేశంపై ఆసక్తి, అంచనాలు ఎక్కువగా ఉంటాయని.. దీంతో మెదడుపై పని పెరుగుతుందని.. అదే, తిరుగు ప్రయాణంలో ఇవేవీ ఉండవని.. దీంతో ఆ సమయంలో సంతోషానికి కారణమయ్యే డోపమైన్ లెవెల్స్ మెదడులో పెరుగుతాయని.. అందుకే ఆ తిరుగు ప్రయాణం చిన్నదిగా, షార్ట్ కట్ లో వచ్చేసినట్లు అనిపిస్తుందని చెబుతున్నారు.

ఈ క్రమంలో... 2011లో 'రిటర్న్ ట్రిప్ ఎఫెక్ట్'కు సంబంధించి నెదర్లాండ్స్ కు చెందిన శాస్త్రవేత్తలు వాన్ డీ వెన్, రిజ్స్విక్, రాయ్ ఒక కాగ్నిటివ్ స్టడీ చేశారు. ఈ పరిశోధన కోసం కొంతమందితో.. బస్సు, సైకిల్, నడక ద్వారా ప్రయాణాలు చేయించారు. వీరికి అన్ని సందర్భాల్లోనూ తిరుగు ప్రయాణానికి తక్కువ సమయం పట్టిన అనుభూతి పొందినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే... వెళ్తున్నప్పుడు కొత్త రహదారులు, ట్రాఫిక్, పరిసరాలను మెదడు గ్రహిస్తూ కాగ్నిటివ్ లోడ్ ను ఎక్కువగా అనుభవిస్తుందని తెలిపారు. అయితే... తిరుగు ప్రయాణంలో అప్పటికే ఆ పరిసరాలతో ఏర్పడిన పరిచయం వల్ల కాగ్నిటివ్ లోడ్ తగ్గుతుందని తేలిందని వెల్లడించారు. అయితే... ఇది అప్పుడప్పుడూ వెళ్లే దూర ప్రాంతాల విషయంలోనే కాదు.. రెగ్యులర్ గా వెళ్లే ప్రదేశాల విషయంలోనూ ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఉదాహరణకు... రోజూ ఆఫీస్ కు వెళ్లేటప్పుడు.. సమయానికి చేరుకుంటానా? ట్రాఫిక్ అవాంతరం ఏర్పడుతుందా? వంటి అనేక ఆలోచనలు ఉంటాయని అంటున్నారు.


అయితే... తిరిగి వచ్చేటప్పుడు ఆ టెన్షన్ ఉండకపోవడం వల్ల.. తిరుగు ప్రయాణాల్లో ఆందోళనలు, ఆలోచనలు తక్కువగా ఉండటంవల్ల.. సమయం తక్కువ పట్టినట్లు అనిపిస్తుందని చెబుతున్నారు.

# రూ. 6 తో ఒక్కరోజులో కోటీశ్వరుడు.. ఆ డబ్బులతో ఏం చేస్తానని ఫిక్స్ అయ్యాడంటే..?



సుమతీ శతకంలో ఒక పద్యం గుర్తుందా..? 'సిరితా వచ్చిన వచ్చును సలలితముగ నారకేశ సలిలము భంగిన్'. ప్రస్తుతం శతకంలో రెండో సగం పక్కన పెడతాం. సంపద అనేది కొబ్బరి కాయలో నీటిలాగా ఎప్పుడు ఎలా వస్తుందో ఎవరికీ తెలియదుగా.. అదే విధంగా కోటగారు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.. గుమ్మడి పండు అంత టాలెంట్, కష్టం ఉన్నా.. ఆవగింజంత అదృష్టం లేకుంటే ఏమీ చేయలేమని. అలాంటిదే లక్కీ లాటరీ కూడా. ఈ లాటరీలు పేదవాడిని ఒక్కసారిగా కోటీశ్వరుడిని చేస్తుంది. కేరళలో ఓనమ్ పండుగ సందర్భంగా లాటరీ ఏర్పాటు చేస్తారు. దాదాపు 30 కోట్లకు పైగా బంపర్ ప్రైజ్. ఈ లాటరీ వరించడం కూడా అదృష్టమే.పంజాబ్ లోని కూలి ఒకే ఒక్క రాత్రిలో కోటీశ్వరుడయ్యాడు. ఆయన కథ తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగకమానదు. పంజాబ్ రాష్ట్రంలోని మోగా జిల్లాకు చెందిన జస్మాయిల్ సింగ్ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య పిల్లలు ఉన్నారు. రోజు కూలి చేస్తేనే కుటుంబం పొట్టనిండేది. కోట్లు ఉండాలని కాదు.. రోజు కుటుంబం కడుపు నింపడం తప్ప ఆయనకు పెద్దగా ఏ కోరికలు లేవు. అయితే ఒక రోజు పని ఉందని ఫిరోజ్ పూర్ కు వెళ్లాడు. అక్కడ ఆయన దృష్టి లాటరీ టికెట్ పై పడింది. తన వద్ద తక్కువ డబ్బే ఉంది. సరే చాయ్ తాగడం పక్కన పెట్టి ఒక టికెట్ కొందాం అనుకున్నాడట.జస్మాయిల్ సంగ్ రూ. 6 పెట్టి ఒక లాటరీ టికెట్ కొన్నాడు. ఇంటికి తిరిగి వచ్చాడు. కొన్ని గంటలు గడిచిన తర్వాత ఆయనకు ఒక ఫోన్ వచ్చింది. 'మీరు కొన్న లాటరీకి బంపర్ ప్రైజ్ వచ్చింది' అని ఆ ఫోన్ సారాంశం. మొదట ఆయన నమ్మలేదట. మరోసారి రీకాల్ చేసి కన్ఫమ్ చేసుకున్న తర్వాత ఖుషీ అయ్యాడు. కనీసం లక్షాధికారి అయినా చాలని అనుకుటున్న ఆయన ఏకంగా కోటీశ్వరుడు అయ్యాడు.ఆయన లాటరీకి రూ. కోటి ప్రైజ్ మనీ గెలుచుకుంది. ఇంత డబ్బుతో ఏం చేస్తావని ఆయనను మీడియా అడగడంతో కుటుంబంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటా అన్నారట. మొదట నాకున్న అప్పు రూ. 25 లక్షలు కడతానని, ఆయన తర్వాత నా భార్య విర్పాల్ కౌర్ తో మాట్లాడి పిల్లల భవిష్యత్ కు కొంచెం పక్కన పెడతానని చెప్పాడు. రోజు కూలి అయిన ఆయనకు కోటి రూపాయలు రావడంతో స్థానికులు కూడా సంతోషం వ్యక్తం చేశారు.

# పక్షులు ఎప్పుడూ 'వీ' ఆకారంలో ఎందుకు ఎగురుతాయి?



రోడ్డుపై వెళ్లే మనిషి కంటే అడవిలోని జంతువులు, ఆకాశంలోని పక్షులు అత్యంత క్రమశిక్షణతో, ఐక్యంగా ప్రయాణిస్తుంటాయని చెబుతారు. ఈ క్రమంలో ఆకాశంలోని పక్షులను పరిశీలిస్తే.. అవి గుంపులు గుంపులుగా ప్రయాణిస్తున్నప్పుడు ఎప్పుడూ ఇంగ్లిష్ అక్షరం "వీ" ఆకారంలోనే ఎగురుతూ కనిపిస్తాయి. ఆ దృశ్యం అత్యంత అద్భుతంగా కనిపిస్తుంది. అయితే పక్షులు ఇలా వీ ఆకారంలోనే ఎందుకు ప్రయాణిస్తాయి.అవును... ఆకాశంలో పక్షులు, ప్రధానంగా కాస్త లాంగ్ జర్నీ చేసే పక్షులు వీ అకారంలో కలిసి ప్రయాణిస్తాయనే సంగతి తెలిసిందే. అయితే.. అవి అలానే ఎందుకు ప్రయాణిస్తాయి.. ఒకదాని పక్కన ఒకటో, చీమల్లా ఒకదాని వెనుక ఒకటో కలిసి ఎందుకు వెళ్లవు అనేది ఆసక్తికర విషయం. దీనిపై ఆక్స్ ఫర్డ్ యూనివర్శిటీ, నాసా సంస్థల శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు.ఇందులో భాగంగా... వీ ఆకారంలో ఎగరడం అనేది పక్షుల శక్తిని ఆదా చేయడంలో సహాయపడుతుందని.. ఇందులో ముందున్న పక్షి గాలి భారాన్ని ఎక్కువగా తీసుకుంటుండగా.. దాని వెనుక ఉన్న పక్షులు తమ నాయకుడి రెక్కల ద్వారా సృష్టించబడిన గాలి ప్రవాహాల పైకి ఎగురుతాయని.. ఈ పైకి కదిలే గాలి వెనకనున్న పక్షులకు అదనపు లిఫ్ట్ ను అందిస్తుందని.. దీంతో అవి తక్కువ శక్తితోనే ఎగరడాన్ని సులభతరం చేస్తుందని తెలిపారు!వాస్తవానికి వీ ఆకారంలో ముందు భాగంలో ఉండటం కష్టమైన పనే. అందువల్ల ఇక్కడే పక్షుల్లోని టీంవర్క్, కోఆర్డినేషన్ కనిపిస్తుంది. ఇందులో భాగంగా... ముందు భాగంలో ఉన్న పక్షి అలసిపోయినప్పుడు, అది వెనక్కి రాగా.. మరొక పక్షి ఆ వీ ఆకారానికి నాయకత్వం వహిస్తుంది. ఈ వ్యూహం మొత్తం సమూహంలో ఒక్క పక్షి ఒంటరిగా ఎగరగలిగే దానికంటే ఎక్కువ దూరం ఎగరడానికి సహకరిస్తుంది.యుఎస్ నేషనల్ ఆడుబన్ సొసైటీ ప్రకారం.. ఈ ఉమ్మడి పనితనం అనేది వెనుకంజలో ఉన్న పక్షుల ప్రయాణించే సామర్థ్యాన్ని 70% వరకు మెరుగుపరుస్తుంది. అయితే ఈ ప్రయాణం కేవలం శక్తిని ఆదా చేయడమే కాకుండా, పక్షులు ఒకదానితో ఒకటి దృశ్య సంబంధాన్ని కొనసాగించడానికి కూడా సహాయపడుతుంది. ప్రధానంగా... గుంపులు గుంపులుగా వేల కిలోమీటర్లు ప్రయాణించే వలస సమయంలో ఇది ఎంతగానో సహాయపడుతుంది.ఇలా వీ ఆకారంలో ఎగరడం వల్ల ప్రతి పక్షి, తన పక్కనున్న తోటి పక్షిని చూడటంతో పాటు సమూహ మార్గాన్ని అనుసరించడం, ఒకరినొకరు ఢీకొనకుండా చూసుకోవడాన్ని సులభతరం చేస్తుందని అంటున్నారు. అంటే... ఈ పక్షుల వీ ఆకార ప్రయాణం కేవలం తెలివిగా ఎగరడం మాత్రమే కాదు, సురక్షితంగా కూడా ఎగరడాన్ని సూచిస్తుందన్నమాట.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

## యూటర్న్ తీసుకున్నట్లేనా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ దాదాపు రెండు గంటల పాటు మీడియా సమావేశం పెట్టారు. అందులో అన్ని అంశాలను ప్రస్తావించారు. అన్నివర్గాల ప్రజలకు తాము అండగా ఉంటున్నామని చెప్పారు. కానీ ఒక్క విషయంలో మాత్రం ఆయన స్పందించలేదు. అదే ఇప్పుడు రాజకీయంగానూ, రాజధాని అమరావతిలోనూ హాట్ టాపిక్ గా మారింది. జగన్ మైండ్ సెట్ మారినట్లుందని సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. అనేక అంశాలను ప్రస్తావించిన జగన్ రాజధాని రైతుల విషయాన్ని మాత్రం పూర్తిగా పక్కన పెట్టేశారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మరో ఇరవై వేల ఎకరాల ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సమీకరణకు నిర్ణయించిన నేపథ్యంలో జగన్ ఆ ప్రస్తావన లేకుండా సమావేశాన్ని ముగించారు.

**అనేక సమస్యలను ప్రస్తావించి...**

మిర్చి, పొగాకు, మామిడి రైతుల సమస్యలను ప్రస్తావించారు. కరేడు లో భూ సేకరణపై కూడా జగన్ మండిపడ్డారు. మూడు పంటలు పండే భూమిని ఎలా సేకరిస్తున్నారని ప్రశ్నించారు. కరేడు రైతులు తనను కలిశారని, వారికి అండగా వైసీపీ నిలబడుతుందని మీడియా సమావేశంలో చెప్పారు. కానీ రాజధాని రైతులు రెండో విడత భూ సమీకరణకు అంగీకరించకపోయినా వారి గురించి మాట్లాడకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాజధాని రైతుల పై ఆగ్రహంతోనే జగన్ వారికి మద్దతుగా మాట్లాడలేదా? లేక జగన్ తన మైండ్ సెట్ ను మార్చుకున్నారా? అన్న చర్చ జరుగుతుంది. అనేక సమస్యలపై పోరాటానికి సిద్ధమని ప్రకటించిన జగన్ రాజధాని భూముల ప్రస్తావన మాత్రం తేలేదు.

**భూ సమీకరణ పై...**

గతంలో అసెంబ్లీ సమావేశంలోనే రాజధాని నిర్మాణానికి ముప్పయి వేల ఎకరాల భూములు అవసరమా? అని ప్రశ్నించిన జగన్ ఇప్పుడు మరో ఇరవై వేల ఎకరాలు సమీకరించడానికి ప్రభుత్వం సిద్ధమయినా ఎందుకు ప్రశ్నించలేదన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తానే అంతకు ముందు అవసరమైతే మరిన్ని భూములు సేకరించాలని తాను అన్నమాటలు జగన్ కు గుర్తుకు వచ్చి ఉండవచ్చని కొందరు నెట్టింట నిలదీస్తున్నారు. అయితే ప్రభుత్వం రెండో విడత ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సమీకరణ విషయంలో కొంత వెనక్కు తగ్గినట్లు ప్రచారం జరుగుతున్నా అది తాత్కాలికమేనని, ఖచ్చితంగా భూ సమీకరణ మరో ముప్పయి వేల ఎకరాలను సేకరిస్తామని అధికారులు చెబుతున్నారు.

**గత ఎన్నికల ముందు వరకూ...**

గత ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ మూడు రాజధానుల అంశంతో జనం ముందుకు వెళ్లి బోల్తాపడ్డారు. మూడు రాజధానుల ప్రతిపాదనను మూడు ప్రాంతాల్లో జనం అంగీకరించలేదని 2024 ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయి. దీంతో గత కొన్నాళ్ల నుంచి మూడు రాజధానుల అంశం జగన్ నోటి వెంట నుంచి రావడం లేదు. పైగా ఇటీవల ఆయన గుంటూరు – విజయవాడను కలుపుతూ రాజధాని నిర్మాణం చేపడితే బాగుండేదని కూడా అభిప్రాయపడ్డారంటే ఆ ప్రతిపాదనను విరమించుకున్నట్లే కనపడుతుందంటున్నారు. అందుకే జగన్ రాజధాని అమరావతి విషయంలో జరిగే విషయాలను కొంతకాలం పరిశీలించిన తర్వాత మాత్రమే రెస్పాండ్ కావాలని భావిస్తున్నట్లుంది. అందుకే రెండు గంటల పాటు జరిగిన మీడియా సమావేశంలో రాజధాని అమరావతి పేరు కూడా తేకుండా జగన్ జాగ్రత్త పడ్డారంటున్నారు.

# ఈ కాలుష్యం చాలా డేంజర్.. సంతాన లోపం, కిడ్నీ సమస్యలు.. ప్రమాదాలెన్నో

కాలుష్యం.. ప్రపంచమంతటినీ వణికిస్తున్న భూతమిది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ కాలుష్యం పెరిగిపోతూనే ఉంది. మానవ మనుగడపై ప్రభావం చూపుతూనే ఉంది. గుండె సంబంధిత జబ్బులతో సంభవిస్తున్న మరణాల్లో 75 శాతం, ఊపిరితిత్తుల వ్యాధులతో జరుగుతున్న మరణాల్లో 25 శాతం కేవలం గాలి కాలుష్యం కారణంగానేనని ఇప్పటికే పరిశోధకులు నిర్ధారించారు. ముఖ్యంగా భారత్, చైనా దేశాలతో కూడిన ఆసియా ఖండం ప్రాంతంలో కాలుష్యం కారణంగా మరణాలు మరింత ఎక్కువని గుర్తించారు. అంతేకాదు కాలుష్యం కారణంగా వంధ్యత్వం, ఎముకలు గుల్లబారిపోవడం వంటి శారీరక సమస్యలతోపాటు మానసిక సమస్యలూ తలెత్తుతాయని తాజాగా పలు పరిశోధనల్లో తేల్చారు. మరి ఈ ప్రమాదాలు, వాటిని నివారించే మార్గాలు తెలుసుకుందాం..





**వంటగది నుంచి వాహనాల పొగ దాకా..**

వాయు కాలుష్యం నేడు ప్రపంచాన్ని వణికిస్తున్న అతి పెద్ద సమస్య. మనకుకనిపించే కాలుష్యం పొగ గొట్టాల నుంచి, శిలాజ ఇంధనాల దహనం నుంచి, వాహనాలు తదితర వాటి నుంచి ఎక్కువగా వెలువడుతోంది. వీటి వల్ల అతి ప్రమాదకరమైన గోధుమ రంగు పొగ మంచు (బ్రౌన్ హెజ్) వాతావరణంలో ఏర్పడుతోంది. ఇది మనిషిఆరోగ్యానికి చాలా ప్రమాదకరమైనదని అమెరికన్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
శిలాజ ఇంధనాలు అంటే పెట్రోల్, డీజిల్, కిరోసిన్ వంటి వాటిని మండించినప్పుడు అతి సూక్ష్మమైన కణాలు (అల్ట్రా ఫైన్ పార్టికల్స్) వెలువడుతాయి.
వీటి నుంచే కాకుండా గ్యాస్ ఆధారిత వాహనాల నుంచి వచ్చే పొగ, గడ్డిని కోసే యంత్రాలు (లాన్ మూవర్స్), కట్టెలను కాల్చడం, ఎండిపోయిన ఆకులను కాల్చలడం, స్మోకింగ్ ద్వారా కూడా అల్ట్రాఫైన్ పార్టికల్స్ గాలిలో కలుస్తున్నాయి.
ఇవి ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమైనవి.
అంతేకాకుండా వంట గదిలో చికెన్, మటన్ వంటకాలు చేసేటప్పుడు కూడా ఈ కణాలు వెలువడుతున్నాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు.
ఇవి వేగంగా గాలిలో కలిసిపోతాయని, తర్వాత ఒకదానికొకటి కలసి పెద్ద కణాలుగా మార్పు చెందుతాయని గుర్తించారు. ఈ అల్ట్రాఫైన్ పార్టికల్స్ రహదారుల పక్కన ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు.



**సంతాన సామర్థ్యం తగ్గిపోవడం**

గాలిలో అత్యధిక కాలుష్యం కారణంగా పురుషుల్లో వంధ్యత్య సమస్య తలెత్తుతోందని తైవాన్ కు చెందిన పరిశోధకులు తేల్చారు. కాలుష్యం వల్ల పురుషుల్లో వీర్య కణాల నాణ్యత తగ్గిపోతోందని గుర్తించారు. 15 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్న దాదాపు 6,500 మంది పురుషుల్లో వీర్య కణాల ఉత్పత్తి, వాటి పరిస్థితి, క్రియాశీలత తదితర అంశాలపై మూడు నెలల పాటు అధ్యయనం చేశారు. ఈ ఫలితాలను రెండేళ్ల సమయానికి అన్వయించి.. అంచనాలను రూపొందించారు.
గాలిలో చేరే పర్టిక్యులేట్ మేటర్ (%ూవీ%) అత్యధిక స్థాయిల్లో పీల్చడం వల్ల వీర్య కణాల ఆకారం, పరిమాణం అసాధారణంగా మారిపోయినట్లు పరిశోధకులు గుర్తించారు. (పర్టిక్యులేట్ మేటర్ అంటే గాలిలో చేరే అతి సూక్ష్మ రసాయన కణాలు, దుమ్ము, ధూళి కణాలు).
అయితే వారిలో వీర్య కణాల సంఖ్య మాత్రం తగిన సంఖ్యలోనే ఉన్నట్లు నిర్ధారించారు. కానీ వాటి సామర్థ్యం లోపించడం కారణంగా.. ఈ వీర్య కణాలు గర్భధారణ కోసం పనికిరానివిగా మారిపోతున్నాయని తేల్చారు.

**ఎముకలు గుల్లబారి విరిగిపోవడం**

ఆస్టియో పోరోసిస్.. అంటే ఎముకల కణాల్లో సాంద్రత తగ్గి గుల్లబారిపోయే సమస్య. దీనివల్ల ఎముకల్లో పటుత్వం తగ్గిపోయి చిన్న దెబ్బ తగిలినా విరుగుతాయి. సాధారణంగా వయసు మీద పడిన కొద్దీ ఎముకల్లో పటుత్వం తగ్గుతూ ఆస్టియో పోరోసిస్ సమస్య తలెత్తుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా ఆస్టియో పోరోసిస్ కారణంగా సుమారు 89 లక్షల మంది ఎముకలు విరిగే సమస్య (కాళ్లు, చేతులు, ఇతర భాగాల్లో ఎముకలు విరగడం) బారిన పడుతున్నట్లు ప్రపంచ ఆస్టియోపోరోసిస్ ఫౌండేషన్ లెక్కతేల్చింది. అయితే గాలి కాలుష్యం ఈ ఆస్టియోపోరోసిస్ సమస్య మరింతగా పెరగడానికి కారణమవుతోందని అమెరికన్ శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గాలి కాలుష్యానికి గురైనప్పుడు శరీరంలో పారా థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతోందని, ఇది ఆస్టియో పోరోసిస్ కు దారి తీస్తోందని గుర్తించారు. ది లాన్సెట్: ప్లానెటరీ హెల్త్ జర్నల్ లో వారి అధ్యయన నివేదిక ప్రచురితమైంది.

**అమెరికన్ శాస్త్రవేత్తలు రెండు దశల్లో ఈ అధ్యయనం చేశారు.**

తొలి దశలో కాలుష్యం ఎక్కువగా ఉండే ఒక ప్రాంతాన్ని, కాలుష్యం అతి తక్కువగా ఉండే మరో ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ఈ ప్రాంతాల్లో 65 ఏళ్లు పైబడిన 92 లక్షల మందికి సంబంధించిన వైద్య రికార్డులను పరిశీలించారు. 2003 నుంచి 2010 వరకు ఏడేళ్లకు సంబంధించిన డేటాను సేకరించి విశ్లేషించారు. ఏయే ప్రాంతంలో ఏ సమయంలో ఎంత మంది ఎముకలు విరిగిన సమస్యతో బాధపడింది లెక్కించారు. ఆయా సమయాల్లో ఏ ప్రాంతంలో ఎంత గాలి కాలుష్యం నమోదైంది పోల్చి చూశారు. మొత్తంగా కాలుష్యం స్థాయి అధికంగా నమోదైన ప్రాంతాలకు చెందినవారిలో ఆస్టియోపోరోసిస్ సమస్య ఎక్కువగా ఉందని, ఎముకలు విరిగే సమస్య కూడా ఎక్కువగా ఉందని గుర్తించారు.
ఇక శాస్త్రవేత్తలు రెండో దశలో వాహనాల కాలుష్యం అత్యధికంగా ఉండే ఓ పట్టణ ప్రాంతాన్ని ఎంచుకుని పరిశోధన చేశారు. 35 ఏళ్ల నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న 692 మంది పురుషులకు సంబంధించి.. కొన్నేళ్ల వైద్య రికార్డులను పరిశీలించారు. కాలుష్యం తక్కువగా ఉండే ప్రాంతాల వారితో పోల్చితే.. కాలుష్యం అధికంగా ఉన్న ఈ పట్టణ ప్రాంతాల వారిలో పారా థైరాయిడ్ హార్మోన్ స్థాయి తక్కువగా ఉందని, ఆస్టియో పోరోసిస్ సమస్య అధికంగా ఉందని గుర్తించారు. శరీరంలో ఎముకల నిర్మాణం, ఎముకలు పటిష్టంగా ఉండడం కోసం పారాథైరాయిడ్ హార్మోన్ కీలకంగా పనిచేస్తుంది. ఇది తక్కువగా ఉండడం కారణంగా ఎముకలు గుల్లబారుతాయి.

**పక్షవాతం ముప్పు కూడా..**

గాలి కాలుష్యం కారణంగా పక్షవాతం వచ్చే ముప్పు కూడా పెరుగుతోందని అమెరికన్ శాస్త్రవేత్తలు ఇటీవలి ఓ అధ్యయనంలో తేల్చారు. పక్షవాతం, దాని సంబంధిత సమస్యల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 50 లక్షల మంది మరణిస్తున్నట్లు అంచనా. దీని బారినపడి ఎంతో మంది శారీరక వైకల్యం పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు పక్షవాతానికి, కాలుష్యానికి మధ్య సంబంధంపై పరిశోధన చేశారు. ప్రపంచవ్యాప్తంగా 28 దేశాలకు చెందిన 62 లక్షల మంది పక్షవాతం బాధితులపై జరిగిన 94 అధ్యయనాలను ఒక చోట క్రోడీకరించి పరిశీలించారు. 1948 నుంచి 2014 మధ్య సుదీర్ఘంగా జరిగిన ఆ అధ్యయనాల ఆధారంగా.. పక్షవాతం సమస్యలకు, గాలిలో హానికర రసాయనాలు, పర్టిక్యులేట్ మేటర్ స్థాయిలకు మధ్య సంబంధమున్నట్లు గుర్తించారు.
విపరీతంగా గాలి కాలుష్యం ఉన్న ప్రాంతాల్లో చిన్న వయసులోనే పక్షవాతం బారిన పడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనంలో నిర్ధారించారు.
ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని.. ఇతర సమస్యలతో పాటు గాలి కాలుష్యం కూడా తోడై బ్రెయిన్ స్ట్రోక్ వంటివాటికి కారణమవుతోందని వారు చెబుతున్నారు.

**కిడ్నీల పనితీరుకు దెబ్బ**

విపరీతంగా గాలి కాలుష్యానికి లోనవుతున్న వారిలో మూత్రపిండ (కిడ్నీ) సంబంధిత సమస్యలు ఎక్కువగా వస్తున్నట్లు అమెరికన్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ శాస్త్రవేత్తలు గుర్తించారు. గాలిలోని కలుషితాలు ఊపిరితిత్తుల ద్వారా రక్తంలోకి చేరుతున్నాయని, ఆ కలుషితాలను తొలగించే క్రమంలో కిడ్నీలు దెబ్బతింటున్నాయని తేల్చారు. వారు ఈ అంశంపై చాలా పెద్ద పరిశోధనే చేశారు. అమెరికా అంతరిక్ష సంస్థ నాసాకు చెందిన శాటిలైట్ల ద్వారా పలు ప్రాంతాల్లో గాలి కాలుష్యం స్థాయిలను లెక్కించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో నివసించే సుమారు 20 లక్షల మందికి సంబంధించిన వైద్య రికార్డులను విశ్లేషించారు.
గాలి కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిడ్నీ సంబంధిత సమస్యలు ఏటేటా బాగా పెరిగిపోతున్నట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు.
అత్యధిక కాలుష్యం స్థాయిలే కాదు.. కొంచెం కాలుష్యంతోనూ కిడ్నీల పనితీరుపై ప్రభావం పడుతుందని.. కాలుష్యం స్థాయిని బట్టి సమస్యల తీవ్రత ఉంటుందని అమెరికాకు చెందిన సెయింట్ లూయిస్ హెల్త్ కేర్ సిస్టమ్ డైరెక్టర్ జియాద్ అల్లీ పేర్కొన్నారు.

**కాలుష్యంతో అధిక రక్తపోటు ముప్పు...**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కమ్ముకుంటున్న సమస్యల్లో అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఒకటి. కాలుష్యం కారణంగా కూడా ఈ సమస్య మరింతగా ఉధృతమవుతున్నట్లు యురోపియన్ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇందుకోసం స్పెయిన్, జర్మనీ, డెన్మార్క్, స్వీడన్, నార్వే తదితర దేశాలకు చెందిన 41 వేల మందిపై 2008 నుంచి 2015 వరకు పరిశోధన చేశారు. సర్వే కోసం ఎంచుకున్న సమయంలో వారెవరికీ కూడా అధిక రక్తపోటు సమస్య లేదు. అనంతరకాలంలో 15 శాతం మందికి ఈ సమస్య తలెత్తింది. అధ్యయనం చేసిన వారిలో అధిక రక్తపోటు సమస్య తలెత్తిన వారి వివరాలను పరిశీలించగా.. వారంతా గాలి కాలుష్యం అధికంగా ఉండే ప్రాంతాల్లోనే నివసిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.
గాలిలో రసాయన కలుషితాలు, పర్టిక్యులేట్ మేటర్ ఊపిరితిత్తుల ద్వారా శరీరంలో చేరి ఆరోగ్య సమస్యలను తలెత్తుతున్నాయని, అధిక రక్తపోటు సమస్యకు దారి తీస్తోందని పరిశోధనకు నేతృత్వం వహించిన జర్మనీ హెన్రిచ్ హేయిన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బార్బరా హాఫ్ మన్ వెల్లడించారు.

**గర్భస్త శిశువుల ఎదుగుదలపై ప్రభావం**

గాలిలో ఉండే హానికరమైన, విషపూరిత రసాయనాలు గర్భస్థ శిశువుల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయని అమెరికన్ పరిశోధకులు చెబుతున్నారు. ముఖ్యంగా గర్భం తొలి దశలో అంటే ఒకటో నెల నుంచి మూడో నెల వరకు ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. న్యూయార్క్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ప్రొఫెసర్ జేసన్ బ్లమ్ నేతృత్వంలోని బృందం దీనిపై పరిశోధన చేసింది. అమెరికాలోని పలు ప్రాంతాల్లో చిన్నారులకు జన్మనిచ్చిన మహిళల వైద్య రికార్డులను, ఆయా ప్రాంతాల్లో కాలుష్యం స్థాయిలను వారు విశ్లేషించారు. దీంతోపాటు ప్రయోగశాలలోనూ గర్భస్థ ఎలుకలపై పరిశోధన చేశారు.
కాలుష్యం కారణంగా గర్భంలో పిండం ఎదుగుదల దెబ్బతింటుందని, నెలలు నిండకముందే కాన్పు జరుగుతుందని పరిశోధనలో తేలినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
ముఖ్యంగా గర్భం తొలిదశలో అంటే తొలి మూడు నాలుగు నెలల పాటు తీవ్ర స్థాయిలో కాలుష్యానికి గురైతే.. బిడ్డ చాలా తక్కువ బరువుతో జన్మిస్తున్నట్లుగా వెల్లడైంది.

**కలుషితాలతో మానసిక సమస్యలు**

కలుషితమైన గాలి కారణంగా శారీరక సమస్యలే కాదు.. మానసిక సమస్యలూ తలెత్తుతున్నట్లు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ పరిశోధకులు తేల్చారు. దీనిపై అమెరికాలోని పలు ప్రాంతాల్లో గాలి కాలుష్యం డేటాను సేకరించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్యం రికార్డులతో సరిపోల్చి విశ్లేషించారు. కాలుష్యం తక్కువగా ఉన్న ప్రాంతాలతో పోలిస్తే.. ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని వారు 17 శాతం ఎక్కువగా మానసిక సమస్యలు, ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు.
ఇక పురుషులతో పోలిస్తే.. మహిళలపై గాలి కాలుష్యం ఎక్కువ ప్రభావం చూపుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. వీరు ఏకంగా 39 శాతం మంది మానసిక ఒత్తిళ్లతో బాధపడుతున్నట్లు తేల్చారు.
గాలిలోని కలుషితాలు.. మనలో ఒత్తిడిని పెంచే హార్మోన్లు ఎక్కువగా విడుదలవడానికి కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికితోడు కలుషితమైన గాలి కారణంగా వచ్చే శ్వాస సమస్యలు, చర్మ సమస్యలు వంటివి కూడా ఒత్తిడిని పెంచుతున్నాయని పేర్కొంటున్నారు.

**అన్నీ కలసి గుండె జబ్బులు**

గాలిలో కలుస్తున్న వాహనాల పొగ, ఫాక్టరీలు, ఇతర కలుషితాల కారణంగా గుండె పోటు, కవాటాలు, రక్తనాళాలు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నట్లు అమెరికన్ హార్ట్ అసోసియేషన్ హెచ్చరిస్తోంది. ఆల్కాహాల్, కాఫీ వంటి వాటి అతి వినియోగం కారణంగా గుండె పోటు వచ్చే ప్రమాదం ఎంతగా ఉందో.. గాలి కాలుష్యం కారణంగా అంతే ప్రమాదం ఉందని స్పష్టం చేస్తోంది. ఇందుకోసం అమెరికన్ హార్ట్ అసోసియేషన్ శాస్త్రవేత్తలు 1960 నుంచి 2010 మధ్య జరిగిన 36 అధ్యయనాల ఫలితాలను క్రోడీకరించి పరిశీలించారు.
మొత్తంగా సంభవిస్తున్న గుండెపోటు ఘటనల్లో 5 నుంచి 7 శాతం వరకు గాలి కాలుష్యమే కారణమని వెల్లడైందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
ముఖ్యంగా ఇతర జబ్బులతో బాధపడుతున్నవారు గాలి కాలుష్యానికి లోనైతే గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

# సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లా దూసుకెళ్తున్న అనిల్!



భోళా శంకర్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి లైనప్ చాలా సాలిడ్ గా ఉంది. ఓ వైపు యంగ్ డైరెక్టర్ వశిష్టతో సోషియో ఫాంటసీ డ్రామాగా విశ్వంభరను చేస్తున్న చిరూ, మరోవైపు టాలీవుడ్ హిట్ మిషన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది వెంకీతో కలిసి సంక్రాంతి కి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ ను అందుకున్న అనిల్, ఇప్పుడు మెగాస్టార్ తో సినిమా చేస్తున్నారు.

అసలే అనిల్ రావిపూడికి మంచి కామెడీ సినిమాలు తీసి ఆడియన్స్ ను అలరిస్తారని పేరుంది. ఇప్పుడు అతనికి చిరంజీవి లాంటి కామెడీ టైమింగ్ ఉన్న హీరో దొరికితే సినిమా ఏ రేంజ్ లో ఉంటుందో ప్రత్యేకంచి చెప్పనక్కర్లేదు. చిరూ కెరీర్ లో 157వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఇప్పటికే అనిల్ రావిపూడి రెండు షెడ్యూల్స్ ను పూర్తి చేశారు. ఇప్పుడు మెగా157కు సంబంధించిన మూడో షెడ్యూల్ కు మేకర్స్ ప్లాన్ చేశారు. అందులో భాగంగానే జులై 8న మెగా157 మూడో షెడ్యూల్ హైదరాబాద్ లో ప్రారంభం కానుంది. హైదరాబాద్ లో కొన్ని రోజుల షూటింగ్ తర్వాత చిత్ర యూనిట్ కేరళకు వెళ్లనుందని తెలుస్తోంది. జులై 22కు మెగా157 మూడో షెడ్యూల్ ను పూర్తి చేయనున్నారు డైరెక్టర్ అనిల్ రావిపూడి. ఫిల్మ్ మేకింగ్ లో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అని పేరున్న అనిల్ రావిపూడి మెగా157ను మరింత స్పీడుగా తెరకెక్కిస్తున్నారు. అలా అని క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీపడటం లేదని తెలుస్తోంది. తన గత సినిమాల కంటే మెరుగ్గా ఈ సినిమాను క్వాలిటీతో తెరకెక్కిస్తున్నారు అనిల్ రావిపూడి. ఈ సినిమాలో నయనతార హీరోయిన్ గా నటిస్తుండగా భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. మెగా157ను సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న సంగతి తెలిసిందే.


## మీనాక్షి చౌదరి సిల్వర్ డ్రెస్‌లో అదరగొట్టింది



## నర్గీస్ ఫక్రీ నలుపు రంగులో కలర్ ఫుల్ కలకలం రేపుతోంది



# మెగా ఫ్యాన్స్ నే నమ్ముకున్న హీరోయిన్..!



చెన్నై చిన్నది ప్రియాంక అరుల్ మోహన్ కెరీర్ కన్ ఫ్యూజన్ లో పడింది. నాని గ్యాంగ్ లీడర్ తో తెలుగు ఎంట్రీ ఇచ్చిన ప్రియాంక తమిళ్ లో శివ కార్తికేయన్ తో డాక్టర్, డాన్ లు సినిమాలు చేసి సక్సెస్ అందుకుంది. ఆ తర్వాత సూర్య తో కూడా ఛాన్స్ అందుకుంది అమ్మడు. ఐతే ఆ సినిమా ఫెయిల్ అవ్వడంతో అమ్మడి గ్రాఫ్ పడిపోయింది. ఐతే మళ్లీ తెలుగులో నానితో సరిపోదా శనివారం తో సక్సెస్ వచ్చింది.ఆ సక్సెస్ వచ్చినా కూడా ప్రియాంక మోహన్ కెరీర్ స్పీడ్ అందుకోలేదు. ఐతే ప్రస్తుతం అమ్మడి చేతిలో ఉన్న ఒకే ఒక్క ప్రాజెక్ట్ ఓజీ. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సుజిత్ కాంబినేషన్ లో వస్తున్న సినిమా ఇది. ఓజీ గ్లింప్స్ తోనే సినిమాపై ఎక్స్ పెక్టేషన్స్ పెంచాడు సుజిత్. ఐతే ఈ సినిమాతో ప్రియాంక ఫేట్ కూడా మారుతుందని నమ్ముతుంది.తమిళ్ లో హిట్లు పడినా ఎందుకో అమ్మడికి కమర్షియల్ హీరోయిన్ గా పేరు రాలేదు. అందుకే పవర్ స్టార్ తో ఓజీ సినిమాతో పవర్ కంబ్యాక్ ఇవ్వాలని చూస్తుంది అమ్మడు. ఈ మూవీతో సక్సెస్ రావాలంటే మెగా పవర్ స్టార్ ఫ్యాన్స్ ఆమెను ఎంకరేజ్ చేయాలి. తప్పకుండా సినిమాతో ప్రియాంక సక్సెస్ అందుకునే ఛాన్సులే ఎక్కువ ఉన్నాయి.పవర్ స్టార్ తో సుజిత్ తీస్తున్న స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్ ఓజీ. సినిమాకు థమన్ అదిరిపోయే మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ సినిమా సెప్టెంబర్ 25న రిలీజ్ లాక్ చేశారు. ఓజీ సినిమా హిట్ పడితే మాత్రం ప్రియాంకాకు తెలుగులో మరికొన్ని ఛాన్స్ లు వస్తాయి. ఓజీలో ప్రియాంక ఎలాంటి పాత్రలో నటిస్తుంది. పవన్ తో డ్యుయెట్స్ ఉంటాయా లాంటి విషయాలు తెలియాల్సి ఉంది.

పవన్ కళ్యాణ్ సినిమాలో నటించింది కాబట్టి టాలీవుడ్ లో ప్రియాంకాకు స్టార్ క్రేజ్ వచ్చినట్టే లెక్క. ఐతే ఓజీ సూపర్ హిట్ పడితే మాత్రం అమ్మడికి లెక్కకు మించి ఛాన్స్ లు వస్తాయి. మరి ఈ హీరోయిన్ ని సుజిత్ ఎలా చూపించనున్నాడు అన్నది చూడాలి. ప్రియాంకా మాత్రం మెగా ఫ్యాన్స్ పైనే భారమంతా వేసి ఉంది. సినిమాకు తను పెట్టాల్సిన ఎఫర్ట్ పెట్టేసిన అమ్మడు ఇక రిజల్ట్ ఎలా ఉంటుందో అని సూపర్ ఎగ్జైటెడ్ గా ఉంది. అది తెలియాలంటే ఈ ఇయర్ దసరా వరకు వెయిట్ చేయాల్సిందే.